తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

## అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి అక్టోబర్ 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం మహాళయ అమావాస్య సందర్భంగా రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను చక్కగా ఆలంకరించారు. బోయిలు మోసుకుంటూ శివయ్య గోపురం రాజగోపురంల నుంచి అలంకార మండపం వద్ద చేర్చారు. ఇక్కడ వెండి పల్లకిల్లో స్వామి అమ్మవార్లను ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవం నాలుగుమాడావీదుల్లో సాగింది, ఉత్సవ ఏర్పాట్లను టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి పర్యవేక్షించారు. ఉత్సవంతో పాటు భక్తులకు ప్రసాదాలను వితరణ చేసారు.

మహాళయ అమావాస్య పూజల కోసం

## కదలివచ్చిన భక్త జనం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

'దేశ నలుమూలల నుంచి శివభక్తులు స్వామి అమ్మవార్ల పూజల కోసం ఇక్కడ నిర్వహించే మహిమాన్విత రాహుకేతుదోష నివారణ పూజలకోసం అమావాస్య రోజులు పూజలు జరుపకుంటే మంచి జరుగుతుందనే నమ్మకంతో భక్తులు శనివారం తండోపతండాలుగా కదలి వచ్చారు. ఓ వైపు వేసవి ఎండలు దడపుట్టిస్తున్నా లెక్క చేయక కదలి వచ్చారు. దాంతో ఆలయంలో ఎటు చూసినా శివనామస్మరణతోపునీతమైంది. అన్ని రాహుకేతుదోష నివారణ పూజల కోసం బారులు తీరారు. ఓ వైపు వేసవిని మరిపిస్తూ ఎండలు దడపుట్టిస్తుండగా, మహాళయ అమావాస్య సందర్భంగా తరలి వచ్చిన జనంతో ఆలయం కిట కిట లాడింది. దళారులు తమ ఇష్టారాజ్యంగా దండుకోగా జేబు దొంగలు తమ చేతి లాఘవంతో భక్తుల డబ్బులను దండుకున్నారు. భక్తులకు బస సదుపాయాలు ఓ సమస్యగా మారగా శని, ఆదివారాల్లో పొద్దుపోయాక వచ్చే భక్తులకు తిండికి తిప్పలు తప్పటం లేదు. గురువారం రాత్రి నుంచి సునామిలా భక్త జనం శ్రీకాళహస్తి చేరుకున్నారు. దాంతో 'స్వామీ!ఇదేం జనం? ఇదెక్కడి జనం అంటూ పరిశీలకులు ఆశ్చర్యపోతున్నారు. నెల రోజులుగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తుల తాకిడి పెరుగుతుంది. తిరుమలేశుని దర్శనం సులభతరం చేయటంతో ఇంకా రద్దీ పెరిగింది. ఓ వైపు బస్సులు, మరో రైళ్ళలో ఇంకొక వైపు కార్లలో తండోపతండాలుగా భక్తులు శివయ్య కరుణ కోసం పరుగులు తీస్తున్నారు. అయితే ఇక్కడకు వచ్చిన భక్తుల తిప్పలు వర్ణనాతీతంగా మారింది. ఇక్కడి ఆలయం రూపురేఖలుమార్చటానికి భక్తుల సౌకర్యార్థం రూపొందించిన మాస్టర్ ప్లాన్ అమలు అరచేతిలో స్వర్గంగా మారింది.

**సన్నిదివీధిలో కేంద్రీకరణ:**

గతంలో వచ్చిన భక్తులు నాలుగు మాడావీధుల్లో బస చేసే వారు. ప్రస్తుతం నాలుగో గేటు అంటే సన్నిధివీధిలో లాడ్జిలు, వ్యాపారులు, హోటళ్ళు కేంద్రీకరించబడ్డాయి. దాంతోఈ వీధిలోనే రద్దీ ఏర్పడింది. ఓ వైపు బస, మరో హోటళ్ల ఇంకో వైపు విఐపిల ప్రవేశం మూడు నాలుగో గేట్లు, దేవస్థానం సంత్రాలు ఉండటంతో ఎటు చూసినా భక్తులు, వారి వాహనాలతో నిండిపోతుంది. దాంతో ఇక్కడ భక్తుల రద్దీ చోటు చేసుకుంది. రూ.100కోట్లు వెచ్చించి సేకరించిన స్థలం కేవలం పార్కింగ్‌కే పరిమితం అయ్యింది. ఏళ్ళు గడుస్తున్నా సన్నిధివీధిలో ఒకే ఒక్క భవనం సేకరణ ప్రశ్నార్థకంగా మారింది. కూటమి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా మాస్టర్ ప్లాన్ ముందడుగు వేయలేదు. దాంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇక్కడ ఓవైపు వాహనాలు, మరో వైపు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన జనం రాకపోకలతో అడుగు వేయటానికి వీలులేని పరిస్థితి చోటు చేసుకుంది. రెండేళ్ళుగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమీక్షకు వస్తున్న దేవాదాయశాఖ మంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించటంతోనే సరిపోతుంది. ఇక దేవస్థానం కోట్లు వెచ్చించి రోడ్లు వేసి ఈ మార్గంలో ఆర్‌టిసి బస్సుల రాకపోకలను కట్టడి చేయలేక పోవటంతో నిత్యం ట్రాఫిక్ చిత్తడితో తల్లడిల్లుతున్నారు. అయితే దేవస్థానం పాలకులు, అధికారులకు కార్యాలయం ఎసి గదుల్లో కూర్చొని రాహుకేతుదోష నివారణ పూజల్లో 'రాబడిలెక్కించు'కోవటం తప్ప భక్తుల తిప్పలను పట్టించుకోవటం లేదు.



## ఉత్కంఠ రేపుతున్న స్థానికం!

**ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రిజర్వేషన్లపై టెన్షన్..టెన్షన్**

**-మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులు ఏ వర్గానికి దక్కుతాయో?**

ప్రభాతవార్త-తిరుపతి:

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మేయర్, మున్సిపల్ చైర్మన్, నగర పంచాయతీ పదవుల రిజర్వేషన్లపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఏ పట్టణంలో ఏ పదవి ఏ సామాజిక వర్గానికి కేటాయిస్తారనే అంశంపై ఆశావహులు, రాజకీయ నాయకులు అంచనాలు వేసుకుంటున్నారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం రిజర్వేషన్లపై నిర్ణయాలు తీసుకోవడంతో ఈ ఉత్కంఠ మరింత పెరిగింది. ఆదివారం రిజర్వేషన్లను గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ప్రకటించనున్న నేపథ్యంలో అందరి దృష్టి అధికారిక ప్రకటనపైనే ఉంది. రాష్ట్రంలోని 17 మేయర్ పదవుల్లో బిసిలకు 35.39 శాతం, మున్సిపల్ చైర్మన్ పదవుల్లో 33.02 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు సమాచారం. ఈ లెక్కల ప్రకారం ఆరు మేయర్ పదవులు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కలిపి సుమారు 36 చైర్మన్ పదవులు బిసిలకు దక్కే అవకాశం ఉంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కలిపి 50 శాతానికి మించకూడదనే నిబంధన నేపథ్యంలో పలు పదవులు జనరల్ కేటగిరీలోకి వచ్చే అవకాశం ఉంది. అన్ని వర్గాల్లోనూ మహిళలకు 50 శాతం ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంటుంది.

**-ఉమ్మడి జిల్లాలో రెండు మేయర్ పదవులు:**

2022లో జిల్లాల పునర్విభజనతో పాత ఉమ్మడి చిత్తూరు జిల్లా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలుగా విడిపోయింది. అయినప్పటికీ, పాత ఉమ్మడి జిల్లా పరిధిలోని పట్టణ స్థానిక సంస్థలను ప్రాతిపదికగా తీసుకుని రాజకీయ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి.

చిత్తూరు: గత ఎన్నికల్లో చిత్తూరు మేయర్ పదవి ఎస్సీ కేటగిరీకి రిజర్వ్ అయింది. ఈసారి రొటేషన్ విధానం ప్రకారం జనరల్ గానీ బిసి కేటగిరీలోకి వచ్చే అవకాశం ఉందని కొందరు అంచనా వేస్తున్నారు.

గతంలో తిరుపతి మేయర్ పదవి జనరల్ మహిళా కేటగిరీకి కేటాయించారు. ఈసారి రిజర్వేషన్ మార్పులపై ఉత్కంఠ నెలకొంది. జనరల్ గానీ బిసి కేటగిరీల్లో ఏదో ఒకదానికి కేటాయించే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తిరుపతిలో రెడ్డి, బలిజ సామాజిక వర్గాలకు చెందిన ఆశావహులు మేయర్ పదవిపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

**ఐదు మున్సిపాలిటీలు.. మూడు నగర పంచాయతీలు :**

పాత ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఐదు మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీల రిజర్వేషన్లపైనా చర్చ సాగుతోంది. 2021 ఎన్నికల్లో అమలైన రిజర్వేషన్లను ప్రాతిపదికగా తీసుకుని ఈసారి మార్పులు ఎలా ఉంటాయన్న దానిపై అంచనాలు వేస్తున్నారు. శ్రీకాళహస్తిలో గతంలో జనరల్ మహిళా కేటగిరీ ఉండటంతో ఈసారి జనరల్ గానీ బిసి కేటగిరీపై అంచనాలు ఉన్నాయి. ఇక పుంగనూరు గతంలో జనరల్ కేటగిరీ ఉండగా, ఈసారి బిసి, ఎస్సీ గానీ మహిళా రిజర్వేషన్ వచ్చే అవకాశాలపై చర్చ జరుగుతోంది. పలమనేరులో గతంలో బిసి జనరల్ కేటగిరీకి కేటాయించినందున ఈసారి మరో వర్గానికి అవకాశం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. నగరికి సంబంధించి గతంలో బిసి మహిళా కేటగిరీ ఉండటంతో ఈసారి జనరల్ గానీ ఎస్సీ కేటగిరీపై చర్చ సాగుతోంది. కుప్పంలో గతంలో జనరల్ కేటగిరీ కావడంతో ఈసారి బిసి రిజర్వేషన్ రావచ్చని కొందరు అంచనా వేస్తున్నారు. పుత్తూరులో గతంలో ఎస్‌సి కేటగిరీకి కేటాయించినందున ఈసారి బిసి గానీమరో కేటగిరీకి అవకాశం ఉండవచ్చని భావిస్తున్నారు.

**-రొటేషన్‌పై ఆశావహుల లెక్కలు:**

స్థానిక సంస్థల పదవులకు సాధారణంగా రొటేషన్ విధానం ప్రకారం రిజర్వేషన్లు మారుతుండటంతో గత ఎన్నికల్లో అమలైన కేటగిరీలను పరిశీలిస్తూ ఆశావహులు తమ లెక్కలు వేసుకుంటున్నారు. అయితే, గతంలో ఒక కేటగిరీకి కేటాయించినంత మాత్రాన ఈసారి మరో కేటగిరీకి తప్పనిసరిగా వస్తుందని చెప్పలేం. చట్టపరమైన నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలు, అధికారిక రిజర్వేషన్ క్రమాన్ని బట్టి తుది కేటాయింపులు ఉంటాయి. తిరుపతిలో రెడ్డి, బలిజ సామాజిక వర్గాలకు చెందిన నాయకులతోబాటు చిత్తూరులో బలిజ, కమ్మ తదితర వర్గాలకు చెందిన ఆశావహులు కూడా పదవులపై ఆసక్తి చూపుతున్నారు.

నవరాత్రి బ్రహ్మోత్సవాలకు

## నేడు అంకురార్పణ



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ జరుగనుంది. రాత్రి 7 నుండి 8 గంటల వరకు సేనాధిపతి ఉత్సవం, శ్రీవారి ఆలయంలోని యాగశాలలో అంకురార్పణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఆగమశాస్త్రం ప్రకారం ప్రతి వైదిక ఉత్సవానికి ముందు అంకురార్పణ చేపడతారు. నవధాన్యాలను మొలకెత్తించి ఈ భూమండలమంతా పాడిపంటలతో, పశుపక్ష్యాదులతో సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తారు. శ్రీవారి సర్వసైన్యాధ్యక్షుడు శ్రీ విష్వక్సేనుడు. ఈ సందర్భంగా శ్రీ విష్వక్సేనులని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు చేపడతారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు విష్వక్సేనులు మాడ వీధుల్లో ఊరేగుతారని ప్రాశస్త్యం. నవధాన్యాలు మొలకెత్తేందుకు అవసరమైన పుట్టమన్ను కోసం ముందుగా భూదేవిని ప్రసన్నం చేసుకునేందుకు మేదిని పూజ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అర్చకులు భూసూక్తాన్ని పఠిస్తారు. యాగశాలలో ఈ పాలికల చుట్టూ అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయుదేవుడు, కుబేరుడు, ఈశానతోపాటు మొత్తం 49 మంది దేవతలను ఆవాహన చేస్తారు. పాలికల్లోని నవధాన్యాలను బ్రహ్మోత్స వాల 9 రోజులపాటు పెంచుతారు. చివరిరోజున మొలలను వేరుచేసి స్వామివారికి అక్షతారోపణ చేస్తారు.

## సమర్ధతకు సన్మానమా.?

## చంద్రగిరి సిఐ విఆర్‌కు..!

**విచ్చలవిడి గంజాయికి అడ్డుకట్ట,**

**నేరశోధనలో దిట్ట**



చంద్రగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:

విధినిర్వహణలో ఆయన చేసిన సేవలకు సన్మానంగా వేకంట్ రిజర్వ్ (విఆర్) కు పంపారా అనే ప్రశ్న చంద్రగిరిలో సర్వత్రా వినిపిస్తున్నది. సరిగ్గా ఏడాది క్రితం చంద్రగిరి సిఐగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌కుమార్ విధి నిర్వహణలో సమర్ధవంతుడైన అధికారిగా నిలిచారు. ముఖ్యంగా చంద్రగిరిలో గంజాయి వినియోగం, విక్రయం, అక్రమ రవాణా వంటి విషయాలలో నెలకొన్న అపకీర్తిని ఉక్కుపాదంతో అణచివేశారు. రెండు మూడు పర్యాయాలు గంజాయి వినియోగిస్తున్నారనే అనుమానంతో యువకులకు పరీక్షలు నిర్వహించి, పాజిటీవ్ వచ్చిన వారికి కౌన్సిలింగ్ ఇప్పించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలతో మమేకం కావడం, సిబ్బందితో పనిచేయించుకునే విధానం, అధికారులు, రాజకీయ నాయకులతో వ్యవహారిశైలిలో సైతం ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తనదైనశైలి సేవలందించి అందరి మన్ననలు అందుకున్నారు. ముఖ్యంగా నేరశోధనలో దిట్టగా, ప్రత్యేక సమర్ధత కలిగిన అధికారిగా నిరూపించుకున్నారు. అయినప్పటికీ సమర్ధవంతుడైన అధికారి విఆర్ వెళ్ళడమేంటనే ప్రశ్న సాధారణ ప్రజల నుండే కాకుండా మండల స్థాయి అధికారులు, రాజకీయ నాయకుల నుండి సైతం వ్యక్తమవుతున్నది. త్వరలో స్థానిక సంస్థలు ఎన్నికలు రానుండటంతో భౌళిగోళిక అంశాలపై అవగాహన కలిగిన అధికారిని బదిలీ చేయడం కూడా ఇబ్బందికరంగా మారింది. నూతనంగా ఇక్కడికి వచ్చే సిఐ ఈ ప్రాంతం భౌగోళిక స్థితిగతులపై అవగాహన చెందడానికి సమయం లేకపోవడం, ఈ దఫా ఎన్నికలను వైసిపి సైతం ప్రతిష్టాత్మకంగా భావించే అవకాశం వున్నందున పరిస్థితిని ఎప్పకప్పుడు పోలీసులు అంచనా

## తుడా నిధులతో తిరుపతి రోడ్లకు మహర్దశ

**తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి**

**- భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం అభివృద్ధి బాటలు - ఎమ్మెల్యే పులివర్తి నాని**

తిరుపతి హెల్త్, అక్టోబర్ 10, ప్రభాతవార్త

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఉన్న నాలుగు నియోజకవర్గాలలో తుడా నిధులను ఉపయోగించి రోడ్డు మార్గాలను విస్తరింప చేస్తూ ప్రజా ప్రయోజన కార్యక్రమాలు చేస్తున్నామని, ఇప్పుడు తుడా నిధులతో జిల్లా సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్నామని తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో చంద్రగిరి నియోజకవర్గ శాసనసభ్యులు పులివర్తి నానితో కలిసి తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. టీటీడీ నిధులతో శ్రీ పద్మావతి అమ్మవారి క్షేత్రంలో ప్రజలకు, భక్తులకు, యాత్రికులకు, తిరుపతికి వచ్చే వివిఐపిలను దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు దివాకర్ రెడ్డి చెప్పారు. తిరుచానూరులో పార్కింగ్ సమస్య లేకుండా, భక్తులకు మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణంలో భాగంగా అన్నదానం కార్యక్రమాలకు ఉపయోగపడే విధంగా కూడళ్ళ నిర్మాణం చేసే విధంగా ప్లాన్ రూపుదిద్దామన్నారు. రూ.200 కోట్లతో 19 కిలోమీటర్ల రేడియస్ ప్రాంతంలో మోలిక వసతులు కల్పన కోసం ఇప్పటికే టెండర్లను ఆహ్వానించినట్లు చెప్పారు. దామినేడు రోడ్డు, పద్మావతి అమ్మవారి క్షేత్రం, అవిలాల ట్యాంకు, మదనపల్లి - బెంగుళూరు మధ్య 6.8 కి.మీటర్ల రోడ్డు అనుసంధానంగా, మంగళం - శెట్టిపల్లి, కరకంబాడి నుండి శెట్టిపల్లి ప్లాట్స్ వరకు ఇలా 8 రోడ్ల నిర్మాణం



చేపట్టనున్నట్లు చెప్పారు. ఎన్నడూ లేనివిధంగా 15 నెలల కాలంలో మొదటి పేస్‌లో రూ.350 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు టెండర్లను పిలిచిన ఘనత మా కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. తిరుపతిలో తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించి ప్రజలు స్వచ్ఛందంగా ఇళ్లకు, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ దీపాలంకరణ చేసి యావత్ దేశం తిరుపతి వైపు చూసే విధంగా అలంకరణ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థుల గెలుపు తధ్యం అని దివాకర్ రెడ్డి అన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చంద్రగిరి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నామన్నారు. ముఖ్యంగా ఐతేపల్లి రంగంపేట మధ్య మొదటి దశలో రూ.35 కోట్లతో, రెండవ దశలో రూ.25 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఐతేపల్లి వడమాల పేట వయా రామచంద్రపురం మండలం మీదుగా ఒక రోడ్డు ప్రతిపాదనను సిద్ధం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హాయంలో తుడా నిధులను దుర్వినియోగం చేశారని, కానీ నేడు లోటు బడ్జెట్ ఉన్నా కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందిస్తూ, మోలిక సదుపాయాల కల్పనలో ముందంజలో నిలుస్తోందని చెప్పారు. చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధిలో తుడా నిధులు కీలకంగా ఉన్నాయని, మరిన్ని నిధులు కేటాయించగలిగితే నియోజకవర్గంలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, శీను పాల్గొన్నారు.

## బిసిలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడమే లక్ష్యం

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు(నగరి), అక్టోబరు 10 ప్రభాతవార్త :

బిసిలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. శనివారం నగరి పట్టణంలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే టిడిపి సిద్ధాంతమని పేర్కొన్నారు. బిసిలకు 34 నుంచి 35 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయిస్తే వైసిపి కోర్టును ఆశ్రయించడం వల్ల న్యాయపరమైన అడ్డంకులు ఎదురయ్యాయని తెలిపారు. బిసిలు విద్య, వ్యాపార రంగాల్లో రాణించి సమాజంలో గౌరవప్రదమైన స్థానం పొందాలనేది టిడిపి ఆశయమ న్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలని, ఎన్నికలనం తరం ప్రజా సేవ, సంక్షేమం, అభివృద్ధి తమ విధానమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయని ఆరోపించారు. అందువల్ల ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులు, శ్మశాన వాటికల నిర్మాణానికి స్థలం కొరత ఏర్పడి ఇబ్బందులు ఎదుర వుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు పరిరక్షించి అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పోతూ రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి, పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ డి.ఎస్.గణేష్, నగరి పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్‌లు పాల్గొన్నారు.

**ప్రతి ఎన్నికలోనూ టిడిపి గెలవాలి : భానుప్రకాశ్**

స్థానిక ఎన్నికల్లో పంచాయతీలు, మునిసిపాలిటీల్లో ప్రతి వార్డులోనూ తెలుగుదేశం పార్టీ అభ్యర్థే గెలవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. స్థానిక ఎన్నికలను సీరియస్‌గా తీసుకుని క్యాడర్ సమష్టిగా ఎన్నికల్లో పనిచేయాలన్నారు. స్థానిక అభ్యర్థుల... అభ్యర్థిత్వంపై ఇష్టం లేకపోయినా తెలుగుదేశం పార్టీని, తనను చూసి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని స్పష్టం చేశారు. నగరి నియోజకవర్గాన్ని తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా మారుస్తానని తెలిపారు.

## తిరుపతి జడ్పీ సిఇఓగా శోభన్‌బాబు

చిత్తూరు, అక్టోబర్ 10 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా జడ్పీ సిఇఓగా శోభన్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న శోభన్‌బాబును అదే జిల్లా జడ్పీ సిఇఓగా నియమించింది. ఈ మేరకు జడ్పీ సిఇఓగా శోభన్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

**వ్యర్థాలతో నిండుతున్న తెలుగు గంగ మిట్ట**

**స్వచ్ఛ తిరుపతి సాధన దిశగా వడివడిగా అడుగులు**

**అనుమతి లేకుండా విధులకు దూరంగా ఉంటే చర్యలు!** 6లో

## బస్సు,లారీ ఢీ: డ్రైవర్ మృతి, ఇద్దరికి గాయాలు

తొట్టంబేడు అక్టోబర్ 10 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలం చిన్న సింగమాల జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతి చెందగా ఇద్దరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఎపోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. విజయవాడ నుంచి బెంగళూరుకు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కర్ణాటక, కోలార్ జిల్లా, కరాడిగానహళ్లి గ్రామానికి చెందిన బస్సు డ్రైవర్ కె. ఎస్. మంజునాథ రెడ్డి (49) అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు క్లీనర్ తిమ్మప్ప (38), బెంగుళూరుకు చెందిన ప్రయాణికురాలు భాగ్యలక్ష్మీ (45) స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారిని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మిగిలిన ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం



జరగలేదు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజేష్ ట్రావెల్స్ బస్సు శుక్రవారం రాత్రి 8:30 గంటలకు విజయవాడ నుంచి బెంగళూరుకు బయలుదేరింది. శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో శ్రీకాళహస్తికి సుమారు ఆరుకిలో మీటర్ల దూరంలోని తొట్టంబేడు మండలం చిన్న సింగమల వద్ద ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న టూ టౌన్ సిఐ నాగరాజు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయ కార్యక్రమాలు చేపట్టారు. బస్సులో ఇరుక్కున్న డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదానికి గల కారణాలపై సిఐ నాగరాజు మాట్లాడుతూ... రాత్రంతా డ్రైవింగ్ చేయడం వలన డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకుని ఉండవచ్చునని, ఆ సమయంలో ప్రయాణికులంతా నిద్రలో ఉన్నారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# తిరుపతి డివిజన్

## 6 పోలింగ్ కేంద్రాల తనిఖీ



తొట్టంబేడు, అక్టోబర్ 10(ప్రభాతవార్త

రాబోయే ఎన్నికల నేపథ్యంలో తొట్టంబేడు మండలంలోని పోలింగ్ కేంద్రాలను అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. తొట్టంబేడు ఎస్ ఐ బి.బాలకృష్ణ,ఎంపీడీఓ పి. సురేంద్రనాథ్ లు గుండెలిగుంట, చోడవరం, చేమూరు, చియ్యవరం, కసారం, పిల్లమేడు పంచాయతీలలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు, రహదారి మార్గాలు, తాగునీరు, విద్యుత్, భద్రత ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని చర్చించారు.

## విజ్ఞాన భాండాగారాలు మినీ గ్రంథాలయాలు

రెడ్డివారి గురవారెడ్డి



రేణిగుంట, అక్టోబరు 10, (ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించి, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు విజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డి వారి గురవారెడ్డి అన్నారు. శనివారం రేణిగుంట మండలం గురవరాజుపల్లిలోని మినీ గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. దినపత్రికల రిజిస్టర్, పాఠకుల రిజిస్టర్, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు, పాఠకులతో సమావేశమై గ్రంథాలయంలో దినపత్రికలు, మాసపత్రికలు అందుబాటులో ఉన్నాయా, రేణిగుంట శాఖ గ్రంథాలయం నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి పుస్తకాలు సరఫరా అవుతున్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని, తద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించడంతోపాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మినీ గ్రంథాలయ నిర్వాహకుడు భానుప్రకాశ్ రవి, గ్రామస్తులు, పాఠకులు పాల్గొన్నారు.

## మరణించిన రైల్వే ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా



రేణిగుంట, అక్టోబరు 10 ప్రభాతవార్త:

రేణిగుంట సిఆర్‌యస్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సాయం అందించినట్లు సీఆర్ఎస్ సీడబ్ల్యూఎం ఆనంద్ తెలిపారు. శనివారం ఆయన బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేశారు. తోటి ఉద్యోగి మరణించినప్పుడు వారి కుటుంబాలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, చిన్న సాయం కూడా ఆ కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రైల్వే నుంచి అందాల్సిన ప్రయోజనాలను త్వరితగతిన కల్పిస్తామని, అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డబ్ల్యూపీఓ శ్రీనివాస నాయక్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్డిటి5. రైల్వే ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా.

## విద్యార్థుల ఆలోచనలకు పారిశ్రామిక దిశ

### శ్రీ రామ ఇంజినీరింగ్ కళాశాలలో నూతన ఆవిష్కరణలు



తిరుపతి విద్య అక్టోబర్ 10 ప్రభాత వార్త

ఇంజినీరింగ్ విద్యను ఉద్యోగ సాధనకే పరిమితం చేయకుండా, నూతన ఆవిష్కరణలకు కేంద్రంగా మార్చి, వాటి ద్వారా పరిశ్రమలు స్థాపించే దిశగా విద్యార్థులను ప్రోత్సహించడంపై శ్రీ రామ ఇంజినీరింగ్ కళాశాల దృష్టి సారించింది. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడంతో పాటు, వాటికి చట్టపరమైన రక్షణ కల్పించి వ్యాపార అవకాశాలుగా మలచుకునే మార్గాలను వివరించేందుకు కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలులోని భారతీయ సమాచార సాంకేతిక రూపకల్పన, తయారీ సంస్థ సహకారంతో, కేంద్ర ప్రభుత్వ చిన్న, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న ర్యాంప్ పథకం, ఆంధ్రప్రదేశ్ చిన్న, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.విద్యార్థులు రూపొందించే నూతన వస్తువులు, సాంకేతిక పరిష్కారాలకు తగిన చట్టపరమైన రక్షణ లేకపోతే వాటి ప్రత్యేకతకు భంగం కలిగే అవకాశముంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన నమోదిత వాణిజ్య చిహ్నాలు, పేటెంట్ల ప్రతినిధి అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని మేధో సంపత్తి హక్కుల ప్రాధాన్యతను వివరించారు. నూతన ఆవిష్కరణలకు పేటెంట్లు ఎలా పొందాలి, వ్యాపార గుర్తింపును వాణిజ్య చిహ్నాల ద్వారా ఎలా కాపాడుకోవాలి, తమ ఆలోచనలను ఆదాయాన్ని అందించే వ్యాపారాలుగా ఎలా అభివృద్ధి చేసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు.ఇంజినీరింగ్ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వ్యాపార దృక్పథం పెంపొందించడం అవసరమని కార్యక్రమంలో వివరించారు. విద్యార్థులు తమ ఆలోచనలను ప్రయోగాలకే పరిమితం చేయ కుండా, సమాజానికి ఉపయోగపడే ఉత్పత్తులుగా తీర్చిదిద్ది ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచిం చారు.కార్యక్రమం ముగింపులో కర్నూలు సంస్థకు చెందిన డా. నోయల్ ప్రసంగించి, కార్యక్రమ నిర్వ హణకు సహకరించిన కళాశాల యాజమాన్యం, అతిథులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు. పథకం కింద నిధులు, సహకారం అందించిన ఆంధ్రప్రదేశ్ చిన్న , చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి విశ్వాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు మన్నెం రామిరెడ్డి, కార్యదర్శి మన్నెం రామసుబ్బారెడ్డి, సంచాలకుడు మన్నెం అరవింద్ కుమా ర్ రెడ్డి, ఉపప్రిన్సిపాల్ డా. ఎన్. వాసు, విద్యా సమన్వయకర్త డా. ఎ. ముని శంకర్, తిరుపతి జిల్లా పరిశ్రమలకేంద్రంసంయుక్తసంచాలకుడు,జనరల్ మేనేజర్ జి. చంద్రశేఖర్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులైన అంగన్‌వాడీలకు సొంతూరులోనే ఇంటి స్థలం




చంద్రగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త: అర్హులైన అంగన్‌వాడీ వర్కర్లు, కార్యకర్తలకు తమ సొంతూరులోనే ఇంటి స్థలం కేటాయించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో శనివారం తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ ఆత్మీయ సమావేశానికి ఎంఎల్ఏ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీలకు తల్లికివందనం, వేసవి సెలవులతో పాటు మెడికల్ సెలవులు, 55 ఏళ్ళు నిండిన అంగన్‌వాడీలకు ఆరోగ్యం సహకరించని పక్షంలో స్వచ్ఛంధ పదవీ విరమణ వంటి అనేక కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. వేతనాలు పెంచడంపై త్వరలోనే శుభవార్త వింటారని అన్నార్బు

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

తిరుపతి రూరల్ అక్టోబర్ 11 ప్రభాతవార్త :



ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని డాక్టర్ సుధారాణి తెలిపారు. శ్రీ సాయి సుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతి రూరల్ నలందనగర్‌లోని శ్రీ సాయి సుధా ఇంగ్లిష్ మీడియం స్కూల్ పక్కన ఉన్న సాయి సుధా ఫిజియోథెరపీ కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో 100 మందికి పైగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలతో పాటు ఎముకలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, రోగులకు అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన చికిత్స పొందేలా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ, ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా 10 మందిని ఉచిత శస్త్రచికిత్సల నిమిత్తం ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు ద్వారా అర్హులైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య సేవలకు దూరం కాకుండా, అర్హులైన ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉన్న ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కుమార్, విశ్వనాథ్, శ్రీరంజిని, రాజశేఖర్, మహేష్‌తో పాటు సాయి సుధా ఆసుపత్రి సిబ్బంది పాల్గొని సేవలందించారు.

## నాలుగుమాడావీధుల్లో అండర్ గ్రౌండ్‌కేబుల్: ఏం నిర్వహణ?

శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో 2019 వరకునాలుగుమాడావీధుల్లోని ప్రజలు విద్యుత్ కోత,శనివారం నిర్వహణ పేరుతో అంతరాయం ఎరుగరు. కారణం ఇక్కడి నాయకుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆలయం,పరిసరాల్లో వచ్చిన భక్తులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకూడదని భావించి అధికారులను ఆదేశించే వారు. అయితే వైకాపా పాలనలో సుమారు రూ.14కోట్లు వెచ్చించి విద్యుత్ శాఖ భూగర్భ లైన్లు ఏర్పాటు చేసారు. ఎక్కడా పోల్స్ కానీ విద్యుత్ లైన్లు కానీ కనబడవు. అయితే సాదారణంగా శనివారం,ఆదివారం,సోమ,మంగళవారాల్లో రద్దీ అధికంగా ఉంటుంది. నాలుగుమాడావీధుల్లో లాడ్జిలు,హోటళ్ళు ఉన్నాయి. ఇక్కడ రెండవ శనివారం 'నిర్వహణ మరమ్మత్తుల' పేరుతో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు అంతరాయంకల్గించటంతో లాడ్జిల్లో దిగిన భక్తులు, వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.ఇక ప్రతి రోజూ ఫేజ్ఆఫ్ కాల్ పేరుతో ఒక సారి అంతరాయం కల్గితే క నీసం గంట పాటు సరఫరా ఇవ్వటం లేదు. తండ్రి హయాంలో విద్యుత్ సమస్య ఎరుగని నాలుగుమాడావీధి ప్రజలు తనయుని పాలనలో పరిస్థితిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.మరి వ్యవస్థలు ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నాయనే చర్చ చోటు చేసుకుంది.

## మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ఎస్‌డిపిఓగా బాధ్యతలు స్వీకరించిన మహిళా అధికారి పావని శనివారం జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు ఆదేశాలతో 'ఆపరేషన్ త్రిశూల్' కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీసులు ప్రత్యేక ప్రణాళికలతో పాటు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు.పుణ్యక్షేత్రానికి దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వటంలో పోలీసులతో సహకరించాలని ఆమె పిలుపు నిచ్చారు. ముఖ్యంగా నేడు ఎన్నికల వాతావరణం చోటు చేసుకుందని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులతో సహకరించాలని ఆమె కోరారు. ఇక నియోజకవర్గంలోని సమస్యాత్మక కేంద్రాల వద్ద పోలీసులతో ప్రజలు సహకరించాలని ఆమె పిలుపు నిచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు వ్యతిరేకిస్తే కఠినంగా వ్యవహరించండి:

శ్రీకాళహస్తి పోలీసు సబ్‌డివిజినల్ పరిధిలోని అధికారులు, ఆటో బస్సు డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆటో,బస్సు డ్రైవర్లను ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని,అలాగే నిబంధనలు అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరించాలని పోలీసు అధికారులకు దిశ,దెశ నిర్దేశం చేసారు.మహిళలు, చిన్నారులపై నేరాలు,మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, అనుమానాస్పద కార్యకపాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో శ్రీకాళహస్తి వన్‌టౌన్ సిఐ వెంకటేష్,రూరల్ సిఐ ఇబ్రహీం, టూ టౌన్ సిఐ నాగరాజు, బుచ్చినాయుడుకండ్రిగ సిఐ లక్ష్మీనారాయణ ఎస్ఐలు, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

## పరశురామేశ్వరుని సేవలో పలువురు అతిధులు



ఏర్పేడు,అక్టోబర్ 10 ప్రభాతవార్త

మండలంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని సన్నిధిలో శనివారం పలువురు అతిధులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు జరిపించుకున్నారు. వారికిఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతూ దర్శనం ఏర్పాట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తలగిరినాయుడు, ఆలయ ఇఓ మునిశేఖర్,వేదపండతులు వంశీ పర్యవేక్షించారు. శనివారం ప్రముఖ క్యారెక్టర్ సినీ నటుడు డి.రవి ప్రకాష్ తన సహచరులతో,ఐపిఎస్ అధికారి కార్తికేయలు రాగా వారికి ఆలయ మహాద్వారం వద్ద స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో దర్శనాలతో పాటు ఆలయ ప్రాశస్త్యంను వివరించారు.

## శివుని సన్నిధిలో నాగాలాండ్ గవర్నర్ కార్యదర్శి



శ్రీకాళహస్తి అక్టోబర్ 10 ప్రభాతవార్త

దక్షిణకైలసంగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి అతిథులు తాకిడి అధికంగా ఉంది.ఇందులో భాగంగా శనివారం ఆలయానికి నాగాలాండ్‌గవర్నర్ కార్యదర్శి,ఐఏఎస్ అధికారి తవశీలన్ విచ్చేశారు.ఆయనకు న్యాయవాది, దేవస్థాన మాజీ కమిటి సభ్యులు వడకలూరు.మస్తానయ్య ఆలయంవద్ద సాదర స్వాగతం పలికి దుశ్శాలువాలతో సత్కరించారు.ఆయనతో పాటు గ్రామీణాభివృద్ధి,ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యదర్శి కూడా ఉన్నారు.ఆలయంలో దర్శనం,రాహుకేత పూజలఅనంతరం జనసేన నాయకులు దేవిప్రసాద్,వి.కుమార్‌లు ఉన్నారు.

## సెలవుల్లో బడి తెరిస్తే గుర్తింపు రద్దు!

### దసరా సెలవుల్లో తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు

తిరుపతి విద్య, అక్టోబర్ 10 ప్రభాతవార్త



దసరా సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తే పాఠశాలల గుర్తింపు రద్దు చేసే వరకు చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్ హెచ్చరించారు. సెలవులను ప్రకటించిన తర్వాత కూడా విద్యార్థులను పాఠశాలలకు పిలిపించడం, తరగతులు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నీ సెలవుల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 11న ఆదివారం కావడంతో సాధారణ సెలవులు ఉంటాయని తెలిపారు. సాధారణ పాఠశాలలకు అక్టోబరు 12 నుంచి 21 వరకు, క్రైస్తవ మైనారిటీ పాఠశాలలకు అక్టోబరు 15 నుంచి 21 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు వెల్లడించారు. సెలవులు ముగిసిన అనంతరం అక్టోబరు 22న గురువారం పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయని వివరించారు.సెలవుల సమయంలో నిబంధనలను ఉల్లంఘించి తరగతులు నిర్వహించినట్లు ఫిర్యాదులు అందితే సంబంధిత పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈఓ హెచ్చరించారు. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాలల కరస్పాండెంట్లు నిరక్ష ్యం వహించరాదని సూచించారు.

## వీసీ ఏడాది ప్రస్థానం.. పరీక్షల విభాగం అభినందనలు



తిరుపతి విద్య అక్టోబర్ 10 ప్రభాత వార్త

విశ్వవిద్యాలయ పాలనలో పరీక్షల నిర్వహణ అత్యంత కీలకమైన విభాగం. విద్యార్థుల ఫలితాలు, పరీక్షల ప్రక్రియ, విద్యా సంబంధిత సేవలతో ముడిపడిన ఈ విభాగం అధికారులు.. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ నరసింగరావు పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉపకులపతికి అభినందనలు తెలియజేశారు.విశ్వవిద్యాలయ అభివృద్ధిలో పరిపాలనా విభాగాల మధ్య సమన్వయం, విద్యార్థులకు అందే సేవల సమర్థ నిర్వహణ కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో పరీక్షల విభాగం అధికారులు ఉపకులపతిని కలిసి అభినందించడం విశ్వవిద్యాలయ పరిపాలనా వర్గాల్లో ప్రత్యేకంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి రాజమణిక్యం, సహాయ పరిపాలనాధికారి మురళి, పర్యవేక్షకుడు కె. రవిచంద్రతో పాటు పరీక్షల విభాగం సిబ్బంది పాల్గొన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ నరసింహారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## బాక్సింగ్ బరిలో ఎస్వీ ఆర్ట్స్ ఆధిపత్యం!

### షటిల్ బ్యాడ్మింటన్‌లోనూ రాణించిన దీపిక



తిరుపతి విద్య అక్టోబర్ 10 ప్రభాత వార్త

బాక్సింగ్ బరిలో పంచ్‌లతో ప్రత్యర్థులను నిలువరించి, ఐదు విభాగాల్లో స్వర్ణ పతకాలు.. మరో నాలుగు విభాగాల్లో రజత పతకాలు సాధించి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల క్రీడాకారులు సత్తా చాటారు. ఎస్వీ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాల పురుషుల బాక్సింగ్ పోటీల్లో కళాశాల చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. బాక్సింగ్‌తో పాటు మహిళల షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్‌లోనూ కళాశాల విద్యార్థిని దీపిక రన్నరప్‌గా నిలిచి ప్రతిభ కనబరిచింది.బాక్సింగ్ పోటీల్లో 50 కిలోల విభాగంలో ఫైనలియర్ సత్య, 60 కిలోల విభాగంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థి భార్గవ్ కృష్ణ, 65 కిలోల విభాగంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థి హేవంత్, 80 కిలోల విభాగంలో ప్రథమ సంవత్సరం విద్యార్థి హేమంత్, 90 కిలోల విభాగంలో ప్రథమ సంవత్సరం విద్యార్థి డేవిడ్ రాజ్ స్వర్ణ పతకాలు సాధించారు. వివిధ బరువుల విభాగాల్లో వీరు చూపిన ప్రతిభ కళాశాలకు చాంపియన్‌షిప్ సాధించడంలో కీలకంగా నిలిచింది.రజత పతకాల విభాగంలో 50 కిలోల కేటగిరిలో ద్వితీయ సంవత్సరం విద్యార్థి పుష్పక్, 60 కిలోల విభాగంలో ప్రథమ సంవత్సరం విద్యార్థి యోనోస్, 75 కిలోల విభాగంలో చివరి సంవత్సరం విద్యార్థి హరి, 80 కిలోల విభాగంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థి దేవేంద్ర పతకాలు సాధించారు. మరోవైపు మహిళల షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్ పోటీల్లో చివరి సంవత్సరం విద్యార్థిని దీపిక రన్నరప్‌గా నిలిచింది.విజేతలను ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. కిషన్, ఫిజికల్ డైరెక్టర్ డా. ఎన్. ముస్తాక్ అహ్మద్ అభినందించారు. క్రీడల్లో విద్యార్థులు కనబరిచిన ప్రతిభను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. వై. మల్లికార్జునరావు, సీనియర్ అధ్యాపకులు డా. ఎం. ప్రసాద్‌రావు, డా. ఎం. కిరణ్‌కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ విద్యార్థులకు నైపుణ్య శిక్షణతో ఉద్యోగావకాశాల బాట !

### ఎస్వీ యూనివర్సిటీలో నాంది ఫౌండేషన్ శిక్షణ పూర్తి 300 మందికి ధ్రువపత్రాల పంపిణీ



తిరుపతి విద్య అక్టోబర్ 10 ప్రభాత వార్త

డిగ్రీ విద్యార్థులు చదువుతో పాటు ఉద్యోగ రంగానికి అవసరమైన సంభాషణా నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస లక్షణాలను పెంపొందించుకోవడంపై ఎస్వీ యూనివర్సిటీ దృష్టి సారించింది. ఈ దిశగా విశ్వవిద్యాలయంలోని భౌతికశాస్త్ర విభాగంలో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం, సంభాషణా నైపుణ్యాల శిక్షణ ముగిసింది. మూడు విడతల్లో మొత్తం 300 మంది విద్యార్థులు శిక్షణ పొందగా, ముగింపు కార్యక్రమంలో వారికి ధ్రువపత్రాలు అందజేశారు.విద్యార్థులు విద్యార్హతలు సాధించడంతో పాటు, తమ అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తపరచడం, ఇతరులతో సమర్థంగా సంభాషించడం, ఉద్యోగ ఇంటర్వ్యూలను ఎదుర్కోవడం వంటి నైపుణ్యాలను అలవర్చుకోవడం ప్రస్తుత పోటీ ప్రపంచంలో కీలకంగా మారింది. ఈ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, సంభాషణా నైపుణ్యాలపై అవగాహన కల్పించారు.ముగింపు కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ తాటా నరసింహారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, రెక్టార్ చెంగల్రాయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ఉన్నత విద్య, ఉద్యోగ ప్రయత్నాల్లో వినియోగించుకోవడం అవసరమని కార్యక్రమంలో వివరించారు.కార్యక్రమంలో ఎం.ఎస్సీ విభాగం ప్రిన్సిపాల్ పద్మావతి, భౌతికశాస్త్ర విభాగాధిపతి దేవప్రసాద్ రాజు, జంతుశాస్త్ర విభాగాధిపతి కిశోర్, ప్రాంతీయ విద్యాశాఖ అధికారి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ తిరుపతి జిల్లా అధికారి లోకనాథం, విశ్వవిద్యాలయ అధ్యాపకులు పాల్గొన్నారు. నాంది ఫౌండేషన్ శిక్షకులు శరత్‌బాబు, జీవన్‌కుమార్, సాయి గణేశ్ విద్యార్థులకు శిక్షణ అందించారు. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న విద్యార్థులకు అతిథులు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు.

11 CTR 4:11 CTR 4.qxd 10/10/2026 11:53 PM Page 1



# అనారోగ్య బాధితులకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

## - ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ



సూళ్లూరుపేట, అక్టోబర్ 10, ప్రభాతవార్త

రాష్ట్రంలోని అనారోగ్య బారినపడి ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకొని ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక భరోసా కల్పించడంలో ముందున్నామని ఆమె తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమంకు కూటమి ప్రభుత్వంఅధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆమె తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు 738 మంది లబ్ధిదారులకు రూ 6.39కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందజేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 65 మంది లబ్ధిదారులకు 34 లక్షల 15,234 రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. అలాగే ఇద్దరికీ ఎల్వోసి కింద రూ .4.10 లక్షల రూపాయలను అందజేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ఆకు తోట రమేష్, శ్రీచెంగాళమ్మ దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఎఫ్ఎస్సిఎస్ చైర్మన్ ఏజీ కిషోర్, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మల శ్రీధర్, పాకం వెంకటసుబ్బయ్య, 786 రఫీ, బొమ్మల పలని, వేమిసాని శ్రీనివాసులు నాయుడు, ముప్పాళ్ళ శ్రీహరి రెడ్డి, విజయ్ కుమార్ నాయుడు, ఎస్ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

## ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, అక్టోబర్ 10, ప్రభాతవార్త



పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో పేదలకు సీఎం సహాయనిది చెక్కులను పంపిణీ చేశారు. రెండు సంవత్సరాల కాలంలో 746 మందికి 6.6 కోట్ల రూపాయల సహాయం ఇది చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా కొంతమందికి సీఎం సహాయనిది మంజూరై ఉందని ఆ చెక్కులను కూడా త్వరలో అందజేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ఎవరికి సహాయం చేయలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్న సంక్షేమ పథకాలను యధావిధిగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సంతోషంగా ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. బిజెపి, జనసేన, తెలుగుదేశం కలిసిన కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు పేదల కోసం ప్రవేశపెట్టినట్లు బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. కేంద్రం నుండి రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విరివిగా నిధులు ఇస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పథకాల అమలు కూడా కేంద్రం నుండి నిధులు వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, రూరల్ మండల్ పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమోళి రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, దక్కిలి మండల పార్టీ అధ్యక్షులు కోటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రూ.192 కోట్లతో అభివృద్ధి పనులు

## - ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి, అక్టోబర్ 10, ప్రభాతవార్త

పట్టణంలో 192 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని 3,9,24, వార్డులలో చేపట్టే సిమెంటు రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 20 కోట్ల రూపాయలు డ్రైన్ నిర్మాణ పనులు చేస్తున్నట్లు చెప్పారు. పాల కేంద్రం కూడలి నుండి సాయిబాబా గుడి వరకు డబల్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ పనులను చేస్తామని చెప్పారు. వెంకటగిరి పట్టణంలో సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని తెలిపారు. గొడ్డలి పార్టీ అధికారంలోకి వస్తే మరల అందరిని గొడ్డలితో నరుకుతారని తెలిపారు. వైసిపి పార్టీని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వాలు అవినీతి తప్ప అభివృద్ధి లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరంరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ్ ఆంధ్ర అవార్డు అందుకున్న డాక్టర్ లిఖిత



బాలాయపల్లి, అక్టోబర్ 10, ప్రభాతవార్త

మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా తిరుపతిలో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛభారత్ అవార్డుల వేడుకల్లో బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డును జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు మీదుగా వైద్యాధికారిణి డాక్టర్ లిఖిత అందుకున్నారు. పచ్చదనంతో పాటు ఆస్పత్రి ఆవరణ మొత్తం పరిశుభ్రంగా ఉంచినందుకు డాక్టర్ లిఖితాను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, టిడిపి అధ్యక్షురాలు పనబాక లక్ష్మి అవార్డు అందజేసి అభినందించారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచినందుకు అవార్డు లభించింది అనిడాక్టర్ లిఖిత తెలిపారు.

# శ్రీ నరసింహ స్వామి అవతారంలో శ్రీ వెంకటేశ్వరుడు

సూళ్లూరుపేట, అక్టోబర్ 10, ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీ మద్వేంకట రామ్మూర్తి స్వామి దేవస్థానంలో పెరటాసి నెల నాలుగవ శనివారాన్ని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి నరసింహ స్వామి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి భక్తుల రద్దీతో దేవస్థానం కిటకిటలాడింది. దేవస్థాన అర్చకులు వినుకొండ అనంతపూర్ దీక్షితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

# జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సాయం



సూళ్లూరుపేట, అక్టోబర్ 10, ప్రభాతవార్త

సూళ్లూరుపేటలో ఓ ప్రముఖ టీవీ ఛానల్కు విలేకరిగా పనిచేస్తూ ఆకస్మిక మృతి చెందారు. నవీన్ కుమార్ కుటుంబానికి ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగా ప్రసాద్ 45 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. టిడిపి రూరల్ పార్టీ అధ్యక్షుడు పాకం వెంకట సుబ్బయ్య చేతుల మీదుగా ఈ ఆర్థిక సహాయాన్ని ఆయన సోదరుడు కిరణ్కు అందజేసి ప్రగాఢ

# ఎన్నికల సంఘం ప్రధాన అధికారి దిష్టిబొమ్మ దగ్ధం



వెంకటగిరి, అక్టోబర్ 10, ప్రభాతవార్త

త్రిభుని సెంటర్ ఏరియాలో ఎన్నికల సంఘం ప్రధాన అధికారి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మను సిఐటియు నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల చోరీకి పాల్పడి కోట్లాది మందికి ఓటు హక్కు లేకుండా చేసినటువంటి ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటు మా హక్కు ప్రజాస్వామ్యం మా హక్కు రాజ్యాంగాన్ని కాపాడుకో వడం మన బాధ్య! అని అన్నారు. ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఓటు హక్కును కాపాడుకోవడం కోసం రాజ్యాంగ సంస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని అన్నారు. స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదని అన్నారు. ఎస్ఐఆర్ పేరుతో, అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపుపై తీవ్రమైన ప్రశ్నలు, ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. ఓటర్ల పేర్లు తొలగిస్తే దానికి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిదిఅని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ఎన్నికల నిర్వహణ బాధ్యతను ఎన్నికల సంఘానికి అప్పగించిందన్నారు. ఆర్టికల్ 326 వయోజన ఓటు హక్కుకు రాజ్యాంగ పునాదిని కల్పించిందన్నారు. ఇవి అధికారాన్ని ఇచ్చే నిబంధనలు మాత్రమే కాదు ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యతను కూడా గుర్తుచేస్తాయి అని అన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే సరిచేయండి నకిలీ నమోదులు ఉంటే ఆధారాలతో తొలగించండని అన్నారు. కానీ అర్హులైన పేదల ఓట్లను, కార్మికుల ఓట్లను, దళితుల ఓట్లను, గిరిజనుల ఓట్లను అన్యాయంగా తొలగించే పరిస్థితి రాకూడదని అని అన్నారు. ఓటు హక్కు దయతో ఇచ్చే భిక్ష కాదు అది రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. కార్మికుల వేతనాల కోసం మాత్రమే కాదు, కార్మికుల ప్రజాస్వామిక హక్కుల కోసం కూడా సీఐటీయూ పోరాడుతుందని అన్నారు. ప్రజల ఓటుకు విలువ లేకపోతే ప్రజాస్వామ్యానికి అర్థం ఏముంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రమణయ్య, రాజేందర్, రెడ్డి, గంగయ్య, చిరంజీవి ఆటో కార్మికులు, వీధి విక్రయ దారుల సంఘం కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పెరటాసి శనివారంలో భక్తి పారవశ్యంలో నగర సంకీర్తన



తిరుపతి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:

పుణ్యక్షేత్రం తిరుపతి నగరం పెరటాసి మాసం 4వ శనివారం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. నగర సంకీర్తనకు ప్రత్యేక శోభ సంతరించుకుంది. తిరుపతి నగరంలో నిర్వహించిన నగర సంకీర్తన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో, నుదుటిపై గోవింద నామాలతో మేళతాళాలు, మంగళవాయిద్యాలు, శ్రీహరి నామస్మరణల నడుమ నగర సంకీర్తన ఘనంగా ప్రారంభమైంది. "గోవింద... గోవింద..." నామస్మరణతో తిరుపతి వీధులన్నీ మారుమోగాయి. ప్రతి ఇంటా గోవింద నామం మారుమోగాలని, సమాజంలో భక్తి, సేవాభావం, ఐక్యత పెంపొందాలని సంకల్పంతో నగర సంకీర్తనను నిరంతరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. సంకీర్తన అనంతరం భక్తులకు కత్తుల కిషోర్, కృష్ణంరాజు ల ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేసి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ముగించారు. ఈ కార్యక్రమంలో తొండమునాటి దశరథ రెడ్డి, ప్రవచనకర్త చంద్రమోళి, మునినాథరెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి , , గుండాల గోపీనాథ్రెడ్డి, పురుషోత్తం యాదవ్, మురళి, పొన్నాల జేజిరెడ్డి, రాజేంద్రన్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, , మిట్టపల్లి బ్రహ్మానందం, చిత్రపు హనుమంతరావు వాసుదేవరెడ్డి, కొండే చెంగారెడ్డి, నగర సంకీర్తన మండలి సభ్యులు పాల్గొన్నారు.

# స్థానిక సమరానికి సిద్ధం కావాలి!

## వార్డు నుంచి జడ్పీటీసీ వరకు ప్రతి ఎన్నికా ప్రతిష్టాత్మకం: చెవిరెడ్డి హర్షిత్రెడ్డి

తిరుపతి రూరల్, అక్టోబర్ 10 ప్రభాతవార్త :

స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని, వార్డు సభ్యుడి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ వరకు ప్రతి ఎన్నికనూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్రెడ్డి పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా ఐక్యంగా ముందుకు సాగుతూ, పార్టీ అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు నామినేషన్లకు అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. తిరుపతి రూరల్ మండలంలో తన పర్యటనలో భాగంగా శనివారం పేరూరు, గాంధీపురం, లింగేశ్వర నగర్, సాయినగర్, పుదిపట్ల, చెర్లోపల్లి, వెంకటపతినగర్, పెరుమాళ్ల పల్లి, మల్లవరం పంచాయతీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో బలమైన అభ్యర్థులను బరిలోకి దించి, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.

### మఠం భూముల ఆక్రమణలపై ఆరోపణలు

గాంధీపురం పంచాయతీ పరిధిలో జరిగిన సమావేశంలో చెవిరెడ్డి హర్షిత్రెడ్డి మాట్లాడుతూ.. స్థానికంగా ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న మఠం భూములను గత రెండేళ్లుగా టీడీపీ నాయకులు ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. పేదలు తమ ఆధీనంలో ఉంచుకున్న



ఇళ్ల స్థలాలపైనా ఆక్రమణల ప్రభావం పడుతోందని విమర్శించారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే పేదల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ, విద్యుత్ మీటర్లు, పన్నులు, నిరభ్యంతర ధ్రువపత్రాల పేరుతో వేర్వేరుగా డబ్బులు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ అంశాలపై ప్రజలకు వాస్తవాలను వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు.

పేరూరు గ్రామ పంచాయతీలో సమావేశం ప్రారంభానికి ముందు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి చెవిరెడ్డి హర్షిత్రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థాయిలో పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని పెంపొందించుకోవాలని, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ ఎన్నికల సన్నద్ధతను ముమ్మరం చేయాలని ఆయన సూచించారు.

# స్థానిక ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలి

## వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి



వెంకటగిరి, అక్టోబర్ 10, ప్రభాతవార్త

పురపాలక ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహ అభ్యర్థులు ఎన్నికలకు సిద్ధం కావాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. ముందుగానే ఈ పత్రాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ముందుగా ఓటరు జాబితాలో మీ పేరు ఉందో లేదో చూసుకోవాలని చెప్పారు. ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు సిద్ధంగా చేసుకోవాలని తెలిపారు. రిజర్వుడ్ వార్డుల అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలలో తీసుకోవాలని తెలిపారు. ఇంటి పన్ను, నీటి పన్ను బకాయిలు లేనట్టు ఎన్వోసీ మున్సిపల్ అధికారుల వద్ద తీసుకోవాలని చెప్పారు. నామినేషన్కు అవసరమైన అఫిడవిట్, డిపాజిట్ తదితర పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రకటన వెలువడే వరకు వేచి ఉండకుండా అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని వివరించారు. సరైన పత్రాలు, పూర్తి అవగాహనతో ఎన్నికలకు సిద్ధం కావాలి అని కోరారు.

# అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సూళ్లూరుపేట, అక్టోబర్ 10, ప్రభాతవార్త

రాష్ట్రంలోని అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించికనీస వేతనాన్ని అందజేయాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి కోరారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహించిన అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా మహాసభలను నిర్వహించారు. ప్రస్తుతం వస్తున్న వేతనం కుటుంబ పోషణకు సరిపోవటం లేదని కనీసం 26 వేల రూపాయలను వేతనంగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఉచిత విద్య, వైద్యం అందజేయాలని అన్నారు. జిల్లాలోని అంగన్వాడీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని పలువురు అంగన్వాడి నేతలు కోరారు. అంగన్వాడి కేంద్రాలకు శాశ్వత భవనాలు, మరుగుదొడ్ల సౌకర్యాలు, గ్యాస్ సౌకర్యం, మంచినీటి వసతులు కల్పించాలని అన్నారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలపై ప్రభుత్వం సానుభూతితో వ్యవహరించి న్యాయం చేయకపోతే ఉద్యమం చేసేందుకు వెనుకాడమని వారు హెచ్చరించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు. అంతకు ముందు జిల్లా నలుమూల నుంచి వచ్చిన అంగన్వాడి కార్యకర్తలు స్థానిక హోలీ క్రాస్ జంక్షన్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వద్ద వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు కే సుబ్బరావమ్మ, స్వరూప రాణి, హైమావతి, సిఐటియునాయకులు బాలసుబ్రమణ్యం, జై చంద్ర, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకన్న

# పెరటాశి మాసం, 4వ శనివారం పెద్దఎత్తున దర్శన భాగ్యం

చంద్రగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసి యున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. పెరటాశి మాసం 4వ శనివారం పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకుని తరించారు. ఆలయ అధికారులు భక్తులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. సాయంత్రం స్వామి వారు తన దేవేరులతో తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్లు హరికృష్ణ, రాజ్కుమార్, టెంపుల్ ఇన్స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, ఓఎస్లు మోహన్ నాయుడు, బైరెడ్డి హరిప్రసాద్, అర్చకులు, కళ్యాణ్ స్వామి, విష్ణు స్వామి, రాజేష్ స్వామి, సెక్యూరిటీ సంతాన కృష్ణన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రసన్న వెంకటేశ్వరునికి ఊంజల్సేవ, గ్రామోత్సవం



వడమాలపేట, అక్టోబరు 10 ప్రభాతవార్త:

అప్పలాయగుంటలో అభయహస్తంతో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారికి శనివారం సాయంత్రం ఊంజల్సేవ, గ్రామోత్సవాలను వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు నిత్యకైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అలంకరణ, అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. పెరటాసినెల 4వ శనివారం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో అప్పలాయగుంటకు తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఉభయదేవేరులతో పాటు స్వామివారిని ఊయలలో కొలువుతీర్చారు. శ్రీనివాసుడు గంటపాటు చిద్విలాసంగా ఊయలలూగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన స్వామివారు మాడా వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ, అర్చకులు రమణాచార్యులు, తిప్పయాచార్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

# తర్పాణాలు సమర్పించటానికి తిప్పలు

## భద్రత పేరుతో ఇబ్బందులు స్నానాలకై నిరీక్షణ



శ్రీకాళహస్తిలో తర్పణాలు వదలతాటానికి క్యూలో నిరీక్షిస్తున్న జనం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో అమావాస్య సందర్భంగా పండగ దినాల్లో,మహాళయ అమావాస్య సందర్భంగా పితృదేవతలకు తర్పణాలు వదలటం ఆనవాయితి. ఈ మేరకు ఆ రోజుల్లో సన్నిధివీధిలోని స్వర్ణముఖి నది వద్దున బ్రాహ్మణులకు దానాలు ఇవ్వటం, అలాగే తర్పణాలు వదలటానికి చర్యలు తీసుకుంటారు. భద్రత పేరుతో కర్మక్రియల మండపంలోకి మార్చారు. చిన్న స్థలంలో నిర్వహణకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.ఇక తర్పణాలు వదలిన తరువాత స్నానాలు చేయటానికి ప్రజలు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతంగా మారింది.శనివారం ఉదయం నుంచి స్థానికులు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎక్కడ తర్పణాలు వదలాలో తెలియని స్థితి చోటు చేసుకుంది. దేవస్థానం ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేసారు కానీ తర్పణాలు వదలిపెట్టె చోట ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. స్నాన ఘట్టాల వద్దకు వెళ్ళటానికి ఇబ్బంది పడ్డారు. వందలాది మంది తమ పితృదేవతలకు తర్పణాలు సమర్పించారు.తరువాత స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రీకాళహస్తి వన్టౌన్ సిఐ వెంకటేష్ సారధ్యంలో శనివారం దూర ప్రాంతాల నుంచి వచ్చినభక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ట్రాపిక్ పోలీసు అధికారి గోవిందు వారి సహాచరులు చక్కటి బందోబస్తు ఏర్పాటు చేసారు. ఉదయం ఎంతో ఓర్పు,సహానంతో పని చేసే హోంగార్డు వెంకటరెడ్డిని నియమించారు.ఆతను ఎంతో ఓపికగా భక్తులకు సమాచారం ఇవ్వటమే కాకుండా దిశ దెశ నిర్దేశం చేసారు.

## మానసిక ఆరోగ్యమే సంపూర్ణ ఆరోగ్యానికి పునాది

డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి

పులిచెర్ల, అక్టోబర్ 10 ప్రభాతవార్త:




శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమని పులిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, మానసిక సమస్యలపై ఉన్న అపోహలను తొలగించడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైనప్పుడు వైద్య నిపుణులను సంప్రదించాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం, తగినంత నిద్రపోవడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. మానసిక ఆరోగ్య సమస్యలపై సలహాలు, సూచనల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి చంద్రయ్య, పర్యవేక్షకులు ప్రమీల, పురుషోత్తం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

## జనావాసాల్లో మద్యం దుకాణాలపై స్థానికుల ఆగ్రహం!

గ్రీవెన్స్ ఫిర్యాదుపై ఎక్సైజ్ అధికారుల క్షేత్రస్థాయి విచారణ

రేణిగుంట, అక్టోబరు 10 ప్రభాతవార్త:



జనావాసాల మధ్య మద్యం దుకాణాల ఏర్పాటుతో మహిళలు, విద్యార్థులకు భద్రతాపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని, ఆధ్యా వైన్స్, సర్వేశ్ వైన్స్‌ను పట్టణానికి దూరంగా తరలించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కొండ్రెడ్డి ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రేణిగుంటలోని పాంచాలినగర్‌లో మద్యం దుకాణాల ఏర్పాటుపై ఆమె సెప్టెంబరు 28న తిరుపతి జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఎక్సైజ్ శాఖ సీఐ ఏలూరు నరసా నాయుడు నేతృత్వంలోని అధికారులు సంబంధిత ప్రాంతాన్ని సందర్శించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మద్యం దుకాణాల కారణంగా ఎదురవుతున్న ఇబ్బందులను స్థానికులు అధికారులకు వివరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివేదిక అందజేస్తామని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. విచారణ సందర్భంగా ఆధ్యా వైన్స్ వెనుకవైపు ఉన్న తలుపును వెల్డింగ్ కమ్మలతో శాశ్వతంగా మూసివేయాలని దుకాణం యజమానికి అధికారులు సూచించారు. కార్యక్రమంలో స్థానికులు మునిస్వామి, రాముడు, శివప్రసాద్, ప్రసన్నలక్ష్మి, ఐద్వా మండల అధ్యక్షురాలు భారతి, సీపీఎం నాయకులు వెంకటరమణ, రేణిగుంట ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, సీఐటీయూ మండల కన్వీనర్ సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికల అభ్యున్నతితోనే సమాజ ప్రగతి

రేణిగుంట, అక్టోబరు 10 ప్రభాతవార్త:

బాలికల పట్ల వివక్షను రూపుమాపి, వారికి సమాన విద్యావకాశాలు కల్పించినప్పుడే సమాజం అన్ని




రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ప్రగతి సంస్థ రేణిగుంట మండల సమన్వయకర్త జయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చైతన్యపురం గ్రామంలో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ.. పురాతన కాలం నుంచి ప్రస్తుత కృత్రిమ మేధస్సు (ఏఐ) యుగం వరకు సమాజంలో బాలికలు వివిధ రూపాల్లో వివక్షను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ స్థాయిలోనే ఆహారం, విద్య, ఆరోగ్యం వంటి అంశాల్లో బాలికల పట్ల వివక్ష చూపడం విచారకరమన్నారు. అసమానతలను తొలగించి, బాలికలకు సమాన అవకాశాలు కల్పించాలంటే ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ సమన్వయకర్త సుభాష్ చంద్రయ్య మాట్లాడుతూ.. బాలికల విద్య దేశాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. ప్రతి బాలిక తన ఆశయాలను గుర్తించి, తనలోని ప్రతిభను వెలికితీసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఆడపిల్ల కుటుంబానికి భారం కాదని, భవిష్యత్తుకు ఆధారమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాలికలను చదివిద్దాం.. ఎదగనిద్దాం.. వారి హక్కులను గౌరవిద్దాం.. లింగ వివక్షను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. బాలికలకు సమాన అవకాశాలు కల్పిస్తూ, వారి భవిష్యత్తుకు బాటలు వేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఎస్సీ వీఎల్ నాయకుడు, స్నేహ బాలల సంఘం సభ్యులు, ప్రగతి సంస్థ సిబ్బంది సురేష్, సుమలత, రాజేశ్వరి, వెంకటేష్ అన్న, గంగోత్రి తదితరులు పాల్గొన్నారు.

## మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



**రేణిగుంట, అక్టోబరు 10 ప్రభాతవార్త:** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ చక్రపాణి ఆదేశాల మేరకు వేణుగోపాలపురంలో ప్రజలకు మానసిక ఆరోగ్యంపై హెల్త్ సూపర్వైజర్ కామరాజు అవగాహన కల్పించారు. మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యమని, నిరాశ, ఆందోళన, అధిక ఒత్తిడి, నిద్రలేమి వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ ఒత్తిడి, ఒంటరితనం మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని, సమస్యలను మనసులో దాచుకోకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా నిపుణులతో పంచుకోవాలని తెలిపారు. మానసిక సమస్యలతో బాధపడేవారిని చిన్నచూపు చూడకుండా, వారి మాటలను ఓపికగా విని, ఆప్యాయతతో అండగా నిలవాలని కోరారు. తగిన చికిత్స, కౌన్సెలింగ్‌తో మానసిక సమస్యలను అధిగమించవచ్చని వివరించారు. మానసిక ఒత్తిడి, ఇతర మానసిక సమస్యలతో బాధపడేవారు కేంద్ర ప్రభుత్వ టెలిమానస్ మానసిక ఆరోగ్య సహాయ సేవ 14416 నంబర్‌ను సంప్రదించి అవసరమైన సలహాలు, సహాయం పొందవచ్చని తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం 2026 ఇతివృత్తమైన అనుభవాలను వినండి – నిజమైన స్వరాలు, నిజమైన మార్పు సందేశానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఒమేగా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఖలీద్, సూపర్వైజర్ సరస్వతి, ఏఎన్ఎం రేవతి, ఆశా కార్యకర్తలు, చిన్నపిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ పూర్తి



తిరుపతి, అక్టోబర్ 10ప్రభాతవార్త:

పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ విభాగంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, నాంది ఫౌండేషన్ సహకారంతో ఎంసిఎ విద్యార్థినులకు నిర్వహించిన సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థినులను, కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన కంప్యూటర్ సైన్స్ విభాగం, నాంది ఫౌండేషన్ బృందాలను అభినందించారు. విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానంతో బాటు కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవచ్చని పేర్కొన్నారు. ఇటువంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు విద్యార్థినుల ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో బాటు వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని ఆకాంక్షి ంచారు. ముగింపు కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య పి. వెంకట కృష్ణ, నైపుణ్యాభివృద్ధి అధికారి రమీజాబి పాల్గొన్నారు.

## టీడీపీ నుంచి వైసీపీలోకి చేరిక



విజయపురం, అక్టోబరు 10 ప్రభాతవార్త:

మండలంలోని గంగమాపురం గ్రామంలో శనివారం వైసీపీ మాజీ మంత్రి రోజా సమక్షంలో టీడీపీ నాయకుడు చంద్రశేఖర్ నాయుడుతో పాటు ఆయన అనుచరులు మురుగయ్య, చంగయ్య, రోజా, సభాపతి, లక్ష్మి, మునెమ్మ, సురేష్, గోవిందస్వామి తదితరులతో పాటు సుమారు 50 మంది వైసీపీ పార్టీలోచేరారు. ఈ సందర్భంగా మాజీమంత్రి రోజా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలోపార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ గతంలో వైఎస్ జగన్ పాలనలోని ప్రభుత్వం పేద ప్రజలసంక్షేమానికి పెద్దపీట వేసిందని, కులం, మతం, పార్టీ అనే తేడాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిందని తెలిపారు. పేద ప్రజల సంక్షేమం, రాష్ట్రఅభివృద్ధి కోసం వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని, రోజమ్మను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడమే మా లక్ష్యమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ఐక్యంగా కృషి చేస్తామని, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ జగనన్న సంక్షేమ పాలన తిరిగి రావడానికి మా వంతు కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేశామని తెలిపారు. పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం, విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం, రైతులు, మహిళలు, వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. కూటమిప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, పేద ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా పని చేయాలని రోజా పిలుపునిచ్చారు. సమావేశంలో వైసీపీనాయకులు రవినాయుడు, గుణశేఖర్‌రెడ్డి, శేఖర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, మంజు బాలాజీ, రమేష్‌రెడ్డి, ఏళుమలైరెడ్డి, నారపరాజు, గోవర్ధన్‌నాయుడు, ప్రకాష్ యాదవ్, సతీష్ యాదవ్, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, అరుణాచలం, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యకర్తను కోల్పోయాం : ఎమ్మెల్యే

కేవీబీపురం, అక్టోబరు 10 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీపురం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కరణ మునిరత్నం తెలుగుదేశం పార్టీ కార్యకర్త శుక్రవారం ఆకస్మాత్తుగా మృతి చెందిన విషయం విదితమే. ఈ విషయం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంకు తెలియడంతో శనివారం మృతుని ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి ఆ కుటుంబాన్ని ఓదార్చారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తను పోగొట్టుకున్నామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, బాలాజీ, రంగస్వామిరెడ్డి, ఏ.శివరావు, పరందామిరెడ్డి, జంగారెడ్డి, మురగయ్య తదితరులు ఉన్నారు.

## 13 కోట్ల ఓటర్లను తొలగించిన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

– సీఐటీయూ ధర్నా




పుత్తూరురూరల్, అక్టోబరు 10 ప్రభాతవార్త:

ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో 13 కోట్ల ఓట్లను తొలగించిన కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను వెంటనే రాజీనామా చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. పుత్తూరు పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ ఎదురుగా జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం తెలియజేశారు. వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరుడికిరాజ్యాంగం ఓటు హక్కు కల్పించాలని ఆ హక్కులను కాపాడాల్సిన ఎన్నికల కమిషనర్ కోట్ల మంది ఓటర్లపేర్లను తొలగించడం వారి హక్కులను కాలరాయడం సరైనది కాదని అన్నారు. ఇప్పటికైనాకేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్‌ను రాజీనామా చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు యాషన్ బాషా, రమేష్, దామోదరం, రవి, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఐకమత్యంతో కూటమి ప్రభుత్వాన్ని ఢీ కొడదాం.!

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



చంద్రగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఐకమత్యంతో వ్యవహరించి కూటమి ప్రభుత్వాన్ని ఢీ కొడదామని నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. మండలంలో బిచ్చినాయుడు పల్లి, రాయలపురం, పిచ్చినాయుడుపల్లి, శానంబట్ల, తొండవాడ, దోర్నకంబాల, గంగుడుపల్లి, చంద్రగిరి పంచాయతీలలో శనివారం వైసిపి ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సమరానికి సిద్ధమవుతున్న వేళ టిడిపి నాయకుల నుండి ఎదురయ్యే దాడులు, ధౌర్జన్యాలను ఐక్యంగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. అక్రమ కేసులతో ఇబ్బందులకు గురిచేయాలని చూసిన చట్టబద్ధంగా ఎదుర్కొందామన్నారు. ఈ క్రమంలో ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం వైసిపి నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, మాదవ రెడ్డి, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిఖ్ భాషా, విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శి సూరి, ఎన్.పరమేశ్వర్ రెడ్డి, కె.గంగిరెడ్డి, బోడ్రెడ్డి అచ్యుత విజయ్‌కుమార్ రెడ్డి, యారాశి చంద్రశేఖర్ రెడ్డి, శంకర్ యాదవ్, కొత్తపాటి కోటిరెడ్డి, పృధ్వీరాజ్, మదనమోహన్ రెడ్డి, ఎన్.పరమేశ్వర్ రెడ్డి, కె.గంగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## తిరుచ్చివాహనంపై కల్యాణ వేంకటేశ్వరుని సాక్షాత్కారం

నారాయణవనం, అక్టోబర్ 10 ప్రభాతవార్త :



నారాయణవనంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరుని ఆలయం పెరటాసి మాసం నాల్గవ శనివారంతో భక్తుల సందడి ఉదయం నుంచే ఏర్పడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈ ఆలయ పర్యవేక్షకులు వెంకటశివకుమార్, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయాల్లో ఘనంగా మహాలయ అమావాస్య పూజలు

నారాయణవనం, అక్టోబర్ 10 ప్రభాతవార్త :



మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ పరిధి నాగిలేరు శింగిరికోనలో ప్రసిద్ధి చెందిన శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను నిర్వహించిన తర్వాత అభిషేకం చేసారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు ఉచితంగా అన్నదానం చేసారు. అలాగే నారాయణవనంలో అవదూతగా వెలసిన తాతాసారకాయులస్వామి ఆలయంలోను అమావాస్య పూజలను ఘనంగా జరిపారు. మధ్యాహ్నం వందలాది మంది భక్తులకు అన్నదాన ం నిర్వహించారు.

## నేటి నుంచి శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

నారాయణవనం, అక్టోబర్ 10 ప్రభాతవార్త :

మండలంలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో ఆదివారం నుంచి 10రోజుల పాటు శ్రీ దేవి నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవడం కోసం ముస్తాబు చేస్తున్నారు. మండలంలోని కైలాసకోనలోని కామాక్షాంబిగా అమ్మవారు. సముదాయంలో అవనాక్షమ్మ అమ్మవారు, నారాయణవనంలో ద్రౌపతీదేవి అమ్మవారి ఆలయం, తిరువట్యంలో ఎల్లమ్మ అమ్మవారి ఆలయాలను అలంకరిస్తున్నారు. ప్రతి రోజు అమ్మవార్లు ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

## పదవీ విరమణ కార్మికునికి ఎమ్మెల్యే ఘనసన్మానం

నారాయణవనం, అక్టోబర్ 10 ప్రభాతవార్త :



మండలంలోని భీమునిచెరువు గ్రామానికి చెందిన గంగయ్య శనివారం పుత్తూరు పయనీర్ స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తు పదవీ విరమణ పొందారు. శనివారం పయనీర్ అండ్ స్పిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ముఖ్య అతిథిగా పాల్గొని ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం మాజీ నారాయణవనం జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్ గంగయ్య దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో భీమునిచెరువు గ్రామ ప్రజలు పరమానందం, డి ఆరుముగం, కె నాగయ్య, ఎన్ రమేష్, డి గోవిందస్వామి, పాస్టర్ సెల్వరాజ్, వి శివలింగం, సి జగన్నాదం, సందీప్, రాంబాబు, విజయ్‌కుమార్, కె మునస్వామి, కానిస్టేబుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘ ఉపాధ్యక్షుడిగా పామాంజి రాజేష్

సత్యవేడు, అక్టోబరు 10 ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా సత్యవేడు ముదిరాజ్ సేవా సంఘం మండల ఉపాధ్యక్షులుగా పామాంజి రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జరిగిన సంఘం సభ్యుల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ముదిరాజ్ సేవా సంఘం మండల అధ్యక్షుడు కొనసాగుతున్న శివయ్య ఆధ్వర్యంలో ఈ సంఘం వారి కార్యకలాపాలను కొనసాగిస్తుంది. ముదిరాజ్ మండల ఉపాధ్యక్షులుగా మండల పరిధిలోని పెద్ద ఈటిపాకం గ్రామానికి చెందిన పామాంజి రాజేష్ నియమితులు కావడం పట్ల మండలంలోని పలువురు ముదిరాజ్ సామాజిక వర్గం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ మండలంలో ముదిరాజ్ కులస్తులు సంబంధించిన సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. పైగా ముదిరాజ్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

## కపిలతీర్థంలో అమావాస్యపూజలు

తిరుపతి, అక్టోబర్ 10ప్రభాతవార్త:

మహాలయ అమావాస్య సందర్భంగా పితృదేవతలకు పిండ ప్రధానం,తర్పణం కార్యక్రమాలు జరుపుకునేందుకు వచ్చిన వారితో కపిలేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం నిండిపోయింది. మునుపు ఎన్నడూ లేని విధంగా టిటిడి అధికారులు,విజిలెన్స్ సిబ్బంది, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ఎంతో చక్కగా ఏర్పాట్లు చేశారు. రామకృష్ణ మిషన్ వరకు వాహనాలతో ఉన్నప్పటికీ కూడా, ఎక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మండుటెండను కూడా లెక్కచేయకుండా పోలీస్ యంత్రాంగం, పోలీస్ అధికార్లు దగ్గరుండి పర్యవేక్షి స్తూ కనిపించారు.

## గంగమ్మ ఆలయంలో నవరాత్రి వేడుకలు

తిరుపతి, అక్టోబర్ 10ప్రభాతవార్త:




తిరుపతినగర గ్రామదేవత తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో నేటి నుండి నవరాత్రి వేడుకలు జరగనున్నాయి. ఉదయం 6గంటలకు గణపతి పూజతో ప్రారంభించి ,7 గంటలకు అభిషేకం, హోమం కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం రాత్రి 7 గంటలకు ఊంజలిసేవలో అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఇదే విధముగా ప్రతి రోజు అమ్మవారు రోజుకొక్క అలంకరణలతో దర్శనమివ్వడము జరుగుతుందని భక్తులందరూ ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావలెనని ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ ,ఈఓ ఎ. జయకుమార్ కోరారు.

## లక్షతులసీదళార్చన కార్యక్రమానికి రండి

తిరుపతి, అక్టోబర్ 10ప్రభాతవార్త:



డిసెంబర్ 21 వైకుంఠ ద్వాదశని పురస్కరించుకుని అలిపిరి జూపార్క్ రోడ్డులోని దేవలోక్‌లో నిర్వహించనున్న లక్షతులసీదళార్చన కార్యక్రమానికి విచ్చేయాల్సిందిగా ఎస్వీబిసి చైర్మన్ బి. శ్రీధర్ వర్మను శ్రీ మంత్ర రాజపీఠం పీఠాధిపతి సింహ యాజ స్వామి ఆహ్వానించారు. శనివారం ఉదయం ఎస్వీబిసి కార్యాలయంలో ఆయననను కలిశారు. తిరుమల శ్రీనివాసుని బ్రహ్మోత్సవం పై రూపొందించిన థీమ్ ఆడియో పాటను శనివారం ఎస్‌విబిసి చైర్మన్ బి శ్రీధర్ వర్మ ఆవిష్కరించారు. ఆయుర్వేద వైద్యుడు పార్థ ఆయుర్వేదిక్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కే పార్థసారథి స్వయంగా రచించగా సంగీత విద్వాంసురాలు ఏ భారతీదేవి స్వరపరిచారు.

11 CTR 6:11 CTR 6.qxd 10/10/2026 11:59 PM Page 1



# స్వచ్ఛ తిరుపతి సాధన దిశగా వడివడిగా అడుగులు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 10 ప్రభాతవార్త : స్వచ్ఛ తిరుపతి సాధన దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య సూచనల మేరకు అధికారులు, సిబ్బంది నగరంలోని 102 వార్డు సచివాలయాల్లో హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ పర్యవేక్షణలో శనివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే నగరపాలక సంస్థ కార్యాలయం పరిసరాలతో పాటు, మిద్దెపైన కూడా తనిఖీ చేసి ముందు మన కార్యాలయం నుండే పారిశుధ్య చర్యలు చేపట్టాలని, మార్పు మన నుండే ప్రారంభం కావాలని ఆదేశించి ఆచరించారు. నగరంలోని అన్ని వార్డ్ సచివాలయాలను శుభ్రంగా ఉంచుకోవడం వలన ప్రజలకు పారిశుధ్యంపై చక్కని అవగాహన కల్పించినట్లు అవుతుందని సిబ్బందికి పిలుపునిచ్చారు. అందులో భాగంగానే శనివారం నగరంలోని అన్ని సచివాలయాల్లో యుద్ధప్రాతిపదికన పారిశుధ్య పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, ముఖ్యంగా శానిటేషన్ సెక్రటరీలు ప్రధాన బాధ్యత తీసుకొని పారిశుధ్య కార్మికులతో సమన్వయం చేసుకుంటూ



పారిశుధ్య పనులను వేగవంతంగా నిర్వహించారు. సచివాలయాలు, పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా చూడటం, చెత్తను సక్రమంగా సేకరించి తరలించడం, మురుగు నిల్వలు లేకుండా చూడటం, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం, పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలను ప్రాధాన్యతతో చేపట్టాలని కమిషనర్ స్పష్టం చేశారు. తిరుపతి నగర పవిత్రతను, ప్రతిష్ఠను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని కమిషనర్ పేర్కొన్నారు. నగర పరిశుభ్రత కోసం ప్రతి అధికారి, ఉద్యోగి సమన్వయంతో, అంకితభావంతో, నిజాయితీతో పనిచేయాలని, స్వచ్ఛ తిరుపతి లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన ఊరు స్వచ్ఛ తిరుపతి గా మారాలంటే ప్రజలందరూ మన ఇల్లు, మన పరిసరాలు, మన నగరం పరిశుభ్రంగా ఉంచుకుందాం అనే నినాదంతో పారిశుధ్య కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య కార్యక్రమాలు కేవలం ఒకరోజుకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగాలని, ప్రతి వార్డు సచివాలయం, పరిసరాల పరిశుభ్రతకు సంబంధిత సిబ్బంది బాధ్యత వహించాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టి, నగర ప్రజలకు ఆరోగ్యకరమైన మరియు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలని కమిషనర్ సూచించారు. స్వచ్ఛమైన తిరుపతి - ఆరోగ్యకరమైన తిరుపతి లక్ష్యంగా నగరపాలక సంస్థ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

# తిరుపతి డివిజన్

## తల్లిదండ్రుల రుణం తీర్చుకోండి.!

### మాతానందగిరి స్వామీజీ

రామచంద్రాపురం, అక్టోబర్ 10 ప్రభాతవార్త:



పిల్లలు తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలని శ్రీమాతంగి పీఠాధిపతి మాతానందగిరి స్వామీజీ అన్నారు. శనివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని తిమ్మరాజు పల్లి సమీపంలోని పితృదేవతల స్మారక క్షేత్రంలో సామూహిక పితృతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులను గుర్తుంచుకుని పితృదేవతల రుణం తీర్చుకునేందుకు పితృదేవతల స్మారకార్థం క్షేత్ర నిర్మాణానికి నాంది పలికిన ప్రముఖ న్యాయవాది, సామాజిక సమరసత వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షుడు మోమిడి లీలాకృష్ణ దంపతులను అభినందించారు. గతంలో మునివాహన సేవ వంటి ఉన్నతమైన సేవలు నిర్వహించిన ఘనత లీలాకృష్ణకే దక్కుతుందన్నారు. అనంతరం శ్రీస్వరమాధురి కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆమూరి సుబ్రమణ్యం దంపతులు ధార్మికరత్న పురస్కారాన్ని మోమిడి లీలాకృష్ణ దంపతులకు ప్రధానం చేశారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను ఘనంగా సత్కరించి, అన్నప్రసాద వితరణ గావించారు.

## అనుమతి లేకుండా విధులకు దూరంగా ఉంటే చర్యలు!

### జిల్లా విద్యాశాఖాధికారి కె వి ఎన్ కుమార్



తిరుపతి విద్య, అక్టోబర్ 10 ప్రభాతవార్త

అధికారుల అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్న ఇద్దరు ఉపాధ్యాయులు వెంటనే విధుల్లో చేరాలని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కె వి ఎన్ కుమార్ ఆదేశించారు. విధుల్లో చేరకపోతే క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రేణిగుంట మండలంలోని రేణిగుంట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎస్. నాగేశ్వరరావు ఆగస్టు 21, 2026 నుంచి విధులకు హాజరు కావడం లేదని విద్యాశాఖాధికారి తెలిపారు. సెలవు కోసం సంబంధిత యాప్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అధికారుల నుంచి అనుమతి పొందలేదని పేర్కొన్నారు. అదేవిధంగా ఏర్పేడు మండలం వెంకటంపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ద్వితీయ శ్రేణి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎన్. మునికృష్ణ కూడా ఆగస్టు 21 నుంచి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఇద్దరు ఉపాధ్యాయులు తక్షణమే విధుల్లో చేరాలని విద్యాశాఖాధికారి కె వి ఎన్ కుమార్ స్పష్టం చేశారు. విధులకు హాజరుకాకపోతే ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి, క్రమశిక్షణ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## చంద్రగిరి ఏఎస్ఐగా జోగారావు

చంద్రగిరి, అక్టోబర్ 10 ప్రభాతవార్త:



చంద్రగిరి ఏఎస్ఐగా బి.ఎం.జోగారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఆయన తిరుపతికి బదిలీపై వెళ్ళారు. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయనను చంద్రగిరికి బదిలీ చేయడంతో ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ సురేష్‌కుమార్‌ను కలసి జాయినింగ్ రిపోర్ట్‌ను అందజేశారు. ఎస్ఐలు రవిప్రకాష్ రెడ్డి, అరుణాచలం, అరుణలను మర్యాదపూర్వకంగా కలిశారు.

## కర్మక్రియల మండపాన్ని అభివృద్ధి చేయండి:బిజెపి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త



గొడుగు నీడలో కార్యక్రమాల నిర్వహణ దృశ్యం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలో సువర్ణముఖి నది ఒడ్డును నిర్మించి ఉన్న కర్మక్రియల మండపం అభివృద్ధిని ఎవ్వరూ పట్టించుకోవటం లేదనిబిజెపి నాయకుడు గరికపాటి రమేష్‌బాబు అన్నారు. ప్రతి ఏడాది మహాళయ అమావాస్య, సంక్రాంతి, సందర్భంగా ఇక్కడి నదిలో పితృదేవతలకు తర్పాణాలు విడిచే సంప్రదాయం ఉందని ఆయన వివరించారు. అయితే ఇక్కడ సరైన సదుపాయాల్లేదు. చాలినంత స్థలం లేదు. రాష్ట్ర నలుమూలల నుంచి తర్పాణాలు వదలటానికి వస్తుంటారు. ఈ సమయంలో ఇక్కడ దేవస్థానం పర్యవేక్షణే లేదు. కనీసం ఇక్కడ వచ్చిన వారు ఏం సమస్యలు ఎదుర్కొంటున్నారని పట్టించుకునే దిక్కేలేదని వాపోయారు. 15రోజుల పాటు పితృదేవతలకు తర్పాణాలు వదలే కార్యక్రమాలకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేయాల్సిన శ్రీకాళహస్తీశ్వరాలయ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారిస్తూ ఇక్కడకు వచ్చిన వారికి నిలవ నీడ లేక గొడుగులు నీడలో ఎండలో తర్పాణాలు విడవటానికి ప్రయత్నిస్తున్నారని రమేష్‌బాబు వివరించారు. ఇప్పటికైనా దేవస్థానం అధికారులు నిర్లక్ష్యం వదలి భక్తి భావంతో వచ్చే భక్తుల మనోభావాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

## స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్‌కు అభినందనలు



తిరుపతి హెల్త్, అక్టోబర్ 10, ప్రభాతవార్త

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్‌ని శనివారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం నందు మర్యాద పూర్వకంగా గుంటూరుకు చెందిన పారిశ్రామిక వేత్త వాసిరెడ్డి మృత్యుంజయ వరప్రసాద్, కుటుంబ సభ్యులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి పుష్పగుచ్ఛాలు సమర్పించి శాలువలతో సత్కరించారు. స్విమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన డా. గుడారు జగదీష్ పేద ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి టీటీడీకి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని వీరు ఆకాంక్షించారు.

### ప్రపంచ హాస్పిస్ డే సందర్భంగా

## ప్యాలియేటివ్ కేర్ రోగులకు పండ్ల పంపిణీ




తిరుపతి హెల్త్, అక్టోబర్ 10, ప్రభాతవార్త:

ప్రపంచ హాస్పిస్ డే సందర్భంగా తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర రామనారాయణ రుయా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్యాలియేటివ్ కేర్ విభాగం, బ్లాక్-2లో చికిత్స పొందుతున్న రోగులకు శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల వైద్య విద్యార్థులు పండ్లు పంపిణీ చేశారు. శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు, శ్రీ వెంకటేశ్వర రామనారాయణ రుయా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మనోహర్, ప్యాలియేటివ్ కేర్ విభాగాధిపతి డాక్టర్ రోజా రమణి, ప్యాలియేటివ్ కేర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హర్నాథ్ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు ప్యాలియేటివ్ కేర్ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ప్యాలియేటివ్ కేర్ సేవల ప్రాముఖ్యత, దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అందించే ఉపశమన చికిత్స, నొప్పి నివారణ, మానసిక ధైర్యం, భావోద్వేగ సహకారం వంటి అంశాలపై అవగాహన పొందారు. ప్యాలియేటివ్ కేర్ అనేది రోగుల బాధలను తగ్గించి, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడంతో పాటు, రోగులకు, వారి కుటుంబ సభ్యులకు మానవీయమైన సహకారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా వివరించారు. వైద్య విద్యార్థుల్లో సేవాభావం, మానవీయ విలువలు, రోగుల పట్ల సానుభూతి, సమగ్ర వైద్య సేవల పట్ల అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. రోగికి వైద్యంతో పాటు ఆత్మీయత, ఆత్మస్థైర్యం, గౌరవప్రదమైన జీవనాన్ని అందించడమే ప్యాలియేటివ్ కేర్ యొక్క ప్రధాన లక్ష్యమన్నారు.

### వ్యర్థాలతో నిండుతున్న

# తెలుగు గంగ మిట్ట

### న గంగనీటిలో కలుషితమవుతున్న వ్యర్థాలు..

సత్యవేడు, అక్టోబరు 10 ప్రభాతవార్త:



సత్యవేడు తెలుగు గంగ కాలువ పరిసరాలే చెత్త డంపింగ్ యార్డుగా మారిపోయింది. ఎక్కడెక్కడో నుంచి సేకరించిన చెత్తాచదారాన్ని కాలువ పరిసరాల్లో పడేస్తున్నారు. ఈ కారణంగా ఆ పరిసరాల్లో ఒకటే దుర్గంధం...సమీప గంగ కాలువలో చెత్త, కోళ్ళ ఈకలు, ఇతర మాంసపు ముద్దలు తదితర వ్యర్థాలు పడిపోతున్నాయి. ఈ కారణంగా కాలువలోనీటి కాలుష్యం తీవ్రంగా తయా రైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంగ కాలువ కి.మీ 140 నుంచి ఏకంగా 146 మీటరు వరకు పరిసరాల్లోఎక్కడ చూసినా చెత్తచదారం, ఎక్కడెక్కడో చనిపోయిన జంతువులను తీసుకొచ్చిపడేస్తున్నారు. ఆ మార్గం కూడా నడవడం కూడా స్థానికులకు ఇబ్బందికరంగా మారింది. ఆ కాలువ పరిసరాలకుండానే పలు ఆలయాలు ఉన్నాయి. అదే మార్గంలో కాదిరివేడు, బాలకృష్ణాపురం గ్రామాలు కూడా ఉన్నాయి. అక్కడి వాసులు రాకపోకలు ఈ రోడ్ల మీదనే సాగిస్తున్నారు. చెత్తచదారం, కోళ్ళ ఈకలు, పాడైపోయిన వస్తువులు దుస్తులు తీసుకువచ్చి గుట్టు చప్పుడు కాకుండా పడేస్తున్నారు. సమీపంలోనే గంగ కాలువ నీటిని తోడి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ద్వారా పలు గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోవ్యర్థాలు పడేస్తున్నారు. అందు వల్ల వ్యర్థాలతో జల కాలుష్యం రెట్టింపు అయిందని, ఆ నీటిని సేవిస్తే ప్రమాదకర వ్యాధులు వస్తాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడే వారపు సంత కూడా నిర్వహిస్తున్నారు. చెత్తాచదారం కూడా అక్కడే పడేస్తున్నారు మనల్ని అడిగేవారు ఎవరు లేరు...చెత్తను ఎక్కడ పోస్తే ఏముంది అనే ధీమాతో పంచాయతీ అధికారులు వ్యవహరిస్తున్నారని సత్యవేడు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

### న గంగ అధికారులు ఎక్కడ

గంగ కాలువ పరిసరాలు దుర్గంధ భరితంగా తయారైంది. కాలువ పరిసరాల్లోనే చెత్త పడేస్తున్నారు. పెద్ద డంపింగ్ యార్డులోచెత్త వ్యర్థాలను తీసుకొచ్చి పోస్తున్నారు. దీనికి తోడు గంగామట్టిని ఇప్పటికే తోడేశారు. వారం రోజులు పాటు నిరవధికంగా వర్షం కురిస్తే సుమారు మూడు కి.మీ వరకు గంగ కాలువకు గండి పడే ప్రమాదం కూడా ఉందని స్థానికులు, పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఈటిపాకం, రాచపాళెం నుంచి కొత్తమారికుప్పం వరకు, సత్యవేడు మురుగన్ ఆలయం సమీప నుంచి నూతన సదవాలమ్మ ఆలయం వరకు గతంలో నింపిన గంగ మట్టిని తోడేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే దలవాయి అగ్రహారం, సత్యవేడుకు పెద్ద ప్రమాదం తప్పదని పలువురు ఇంజనీర్లు హెచ్చరిస్తున్నారు.

## వారి తప్పిదాలు మన గెలుపుకు బంగారు బాటలు

### అభ్యంతరాలు చెబుతాము: వినకుంటే కోర్టుకెళతాము

### బియ్యపుమధుసూధనరెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త



స్థానిక సంస్థల ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అధికార తెలుగుదేశం పార్టీ తప్పిదాలు మన గెలుపుకు పునాదులని గెలుపుకు బంగారు బాటలని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటిని చేజిక్కించుకొనుటకు వార్డుల విభజనను చీల్చి చెండాడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. వార్డుల విభజనకు సంబంధించి చట్టపరిధిలో ప్రజాస్వామ్యబద్ధంగా అభ్యంతరాలు తెలియజేస్తామన్నారు. కానీ ఒప్పుకోకపోతే కోర్టునాశ్రయిస్తామన్నారు. ఊరందూరు గ్రామాన్ని ఒక వార్డుగా ప్రకటించుకొని ఎక్కడైతే వైకాపాకు బలం ఉందో ఆ వార్డులను చెల్లా చెదురు చేసారని ధ్వజమెత్తారు. ఊరందూరు గ్రామాన్ని ఒక వార్డుగా ప్రకటించుకొని శ్రీకాళహస్తి వార్డులోని ప్రజలను చల్లా చెదురుచేశారన్నారు. వివిఎం పల్లికి బ్రిడ్జి ముందున్న బిపి అగ్రహానికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. 2019 జగన్ ప్రభుత్వంలో ఊరందూరు గ్రామాన్ని పట్టణంలో కలుపుతారంటే ప్రస్తుత ఎంఎల్‌ఏ కోర్టు కెళ్ళి అభ్యంతరాలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి నందు ఒక అమ్మాయి తప్పు చేస్తే, ఆ తప్పును వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొనడం ఎంత వరకు సమంజసమని మాజీ ఎంఎల్‌ఏ ప్రశ్నించారు. ఇప్పటి వరకు 20లక్షలు రాబట్టామని చెబుతున్నారు, కానీ ఏ అకౌంటు నుండి రాబట్టినారు? వాళ్ళ మీద ఎటువంటి చర్యలు తీసుకున్నారు? అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ చేస్తున్న తప్పులే తమ గెలుపుకు పునాది అని పేర్కొన్నారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొబెట్టడమే లక్ష్యంగా వైయస్‌ఆర్ పి సైన్యం పని చేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకృష్ణయ్య, ఉన్నం వాసుదేవనాయుడు బత్తిరెడ్డి, చెవిరెడ్డి మధుసూధనరెడ్డి, రత్నం రెడ్డి, బుజ్జి మేస్త్రీ, కొత్తపాటి శ్రీనివాసులురెడ్డి, పఠాన్ ఫరీద్,సిరాజ్, ఉత్తరాజీ శరవణ కుమార్, కంఠా ఉదయ్‌కుమార్, గోరా, మున్నారాయల్,జయశ్యాం,తడ్ల తాంగాళ్ బాలాజి ప్రసాద్‌రెడ్డి,పులి రామచంద్రయ్య, కొళ్లూరు హరినాయుడు మహాబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల బస్సుల కండీషన్‌పై తనిఖీలు



శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల కండీషన్‌ను ఆర్టీసి ఈడి తనిఖీ చేశారు. తిరుపతి, ప్రభాతవార్త:

## వంగిన స్తంభాల తొలగింపు: కొత్తవి ఏర్పాటు

### వార్త కథనానికి స్పందన

తొట్టంబేడు, అక్టోబర్ 9 ప్రభాతవార్త



మండలంలోని జ్ఞానమ్మ కండ్రిగ, కొత్త కండ్రిగ గ్రామాల పొలాల్లో నేలవాలిన విద్యుత్ స్తంభాలకు సంబంధించి వార్త దినపత్రికలో ఈ నెల 9న ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. శనివారం కొత్తకండ్రిగ గ్రామ పొలాల్లో పర్యటించి, ప్రమాదకరంగా వంగిన స్తంభాలను సరిచేయడం, కొత్త స్తంభాలను ఏర్పాటు చేసే పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. రైతులు పంట పొలాల్లో భయాందోళనతో పనులు చేసుకుంటున్నారన్న వార్తకు స్పందించి చర్యలు చేపట్టడం పట్ల గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తామని తొట్టంబేడు విద్యుత్ శాఖ ఏఈ బాలాజీ తెలిపారు.

## ధన్వంతరి జయంతి విశిష్టతను గుర్తించండి

### నాయీ బ్రాహ్మణ సాధికార సమితి.. కోట చంద్రశేఖర్



శ్రీకాళహస్తి అక్టోబర్ 10 ప్రభాతవార్త

పురాణ ఇతిహాసాల ప్రకారం ఆయుర్వేదం మరియు ఆరోగ్యానికి దేవునిగా హైందవ జాతి చేత పూజలు అందుకుంటున్న ధన్వంతరి జయంతి విశిష్టతను గుర్తించమని నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికల సమయంలో మన తెలుగుదేశం పార్టీ ఇచ్చిన హామీ మేరకు వైద్య దేవునిగా కొలిచే ధన్వంతరి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా తగిన ఉత్తర్వులు జారీ చేసి, ఘనంగా నిర్వహించేలా సియం చంద్రబాబు నాయుడు గారు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. నాయీ బ్రాహ్మణులు తమ కుల దైవంగా పూజించే వైద్య నారాయణుడైన శ్రీ ధన్వంతరి జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని ఎన్డీయే కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింద తెలిపారు.

## టీడీపీ నాయకుడిని పరామర్శించిన టీడీపీ నేతలు

ఏర్పేడు, అక్టోబర్ 10 ప్రభాతవార్త:



ఏర్పేడు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు డి. నాగేశ్వరరావు ఇటీవల మోటార్ సైకిల్ ప్రమాదంలో గాయపడి, వైద్యం చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం ఆయ నను ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు నాయుడు, యూనిట్ ఇన్చార్జి రాచేటి సుబ్రహ్మణ్యం పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుణ యాదవ్, బూత్ ఇన్చార్జి కేకే రమణ, మనోహర్ నాయుడు, నారాయణ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## చైర్మెన్‌చే అన్నదానం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ చే అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన జన్మదిన సందర్భంగా అభిమానులు కేక్ కటింగ్‌లు చేసారు. పట్టణంలోని ఎంఎం వాడ, మంచినీళ్ళ గుంట, పెండ్లి మండపం, బిక్షాల గాలిగోపురం బహదూరుపేటల వద్ద అన్నదాన కార్యక్రమాలు అభిమానులు నిర్వహించారు.

## తొండమాన్ పురంలో అన్నదానం

శ్రీకాళహస్తి రూరల్, అక్టోబర్ 10 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం మహాళయ అమావాస్య సంద ర్భంగా జిల్లా వైకాపా ప్రధాన కార్యదర్శి, తొట్టంబేడు మండల వైకాపా రథసారధి ఉన్నం వాసుదేవ నాయుడు సారధ్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసారు. రాజకీయంగాను, సామాజికంగా, పేదల పట్ల దయాభావం కల్గిన నాయకు డుగా ఉన్నం వాసుదేవనాయుడు రాణిస్తున్నారు. మహాళయ పక్షాలు ముగింపు సందర్భంగా ఆయన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాల్లో ఆయన సతీమణి తొట్టంబేడు మండల మాజీ అధ్యక్షురాలు ఉన్నం నిర్మలమ్మ తదితరులు పర్యవేక్షించారు.

## బ్రహ్మోత్సవాలలో స్థానికులకు ప్రత్యేక గ్యాలరీలు కేటాయించాలి

### కుప్పాల గిరిధర్ కుమార్ డిమాండ్

తిరుపతి, అక్టోబర్ 10ప్రభాతవార్త:

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానికులకు మాడవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు కేటాయించాలని బాలాజీ రైల్వే సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ టీటీడీ బోర్డును, అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తరతరాలుగా తిరుమల స్థానికులు శ్రీవారి ఉత్సవాలలో భాగస్వాములై విశేష సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. పూర్వకాలంలో తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల ప్రజలు శ్రీవారి నైవేద్యానికి కావలసిన పాలు, పెరుగు, బియ్యం, పప్పు, నూనె, చింతపండు ,కూరగాయలు వంటి సరుకులను కాలినడకన కొండపైకి మోసుకెళ్లి సమర్పించేవారని పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిత్య అన్నప్రసాద వితరణ ప్రారంభించకముందు, స్వర్గీయ ఎన్టీఆర్ అన్నదాన పథకాన్ని ప్రవేశపెట్టకముందు స్థానికులే తమ ఇళ్లల్లో సొంతంగా అన్నప్రసాదాలు తయారుచేసి బ్రహ్మోత్సవాల సమయంలో వేలాదిమంది భక్తులకు పంచిపెట్టేవారని తెలిపారు.

# శ్రీకాళహస్తిలో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలో శనివారం ప్రభుత్వం నిర్వహించే స్కూల్ గేమ్స్ పోటీలు ఘనంగా ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి కెవిఎన్ కుమార్ జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల్లో ఉత్సాహం నింపే విధంగా ప్రసంగించారు. రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఈ ఏడాది రాష్ట్ర స్థాయి క్రీడల పోటీలకు అవకాశం వచ్చింది. దాంతో ఇక్కడి నిర్వాహకులు ఎంతో వ్యవప్రయాసలకోర్చి ఏర్పాట్లు చేపడుతున్నారు. శ్రీకాళహస్తిలోని విక్రమ్ అకాడమి నందు రిపబ్లిక్‌క్లబ్, క్లాసిక్ టెన్నిస్ ఆకాడమి నందు నిర్వహించుటకు నిర్ణయించారు. ఈ నెల 12వ తేది వరకు ఇక్కడ పోటీలు నిర్వహిస్తారు. ఇక్కడ గెలుపొందిన జట్లు ఈ నెల 23న న్యూఢిల్లీలో



జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది.

### మూడు విభాగాలలో . . .

శ్రీకాళహస్తిలో స్కూల్‌గేమ్స్‌ను మూడు విభాగాలుగా విభజించి నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాదికారి కుమార్ వెల్లడించారు. అండర్ 14, అండర్ 17, అండర్ 19లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణను, పట్టుదలను, ఆత్మవిశ్వాసాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొదిస్తాయన్నారు. గెలుపు ఓటములు కాదు. మన ప్రయత్నం మనం చేయాలని పిలుపు నిచ్చారు. ఎందరు పోటీలు చేసిన గెలిచేది ఒక్కరే. అ ఒక్కరు తాము కావాలనే పట్టుదలతో పరుగులు తీయాలన్నారు. ఒకసారి ఓడిపోయినంత మాత్రాన నిరాశ చెందరాదన్నారు. గెలుపుఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో విక్రమ్ టెన్నిస్ అకాడమి ఫౌండర్ డాక్టర్ చంద్రశేఖర్ ఎస్‌జిఎఫ్ కార్యదర్శి సాంబశివరావు, అమ్ములు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కిషోర్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.